ప్రజాశక్తి

మంగళవారం 23 జులై 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

నిర్మలమ్మ కనికరిస్తుందా !



- నేడు కేంద్ర బడ్జెట్
- ముందుకు సాగని కోస్తా లింక్ రైలు మార్గం
- మెట్రో రైలుకు పచ్చజెండా ఊపేనా ?
- వెలవెలబోతున్న పారిశ్రామికవాడలు
- కోస్తా పారిశ్రామిక కారిడార్ ఏర్పాటులో నిర్లక్ష్యం
- ఎన్‌హెచ్ 216కు మోక్షమెప్పుడో !
- అంతంతమాత్రంగానే విమానాశ్రయం అభివృద్ధి

ప్రజాశక్తి-కృష్ణా ప్రతినిధి

కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మంగళవారం మొట్టమొదటిసారిగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెన్‌ను ప్రవేశపెట్టనున్నారు. అయితే ఇప్పటి వరకు బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని బడ్జెట్లలోనూ ఉమ్మడి కృష్ణాజిల్లాకు నిరాశే ఎదురవుతూ వస్తోంది. ఈసారి బడ్జెట్లోనైనా ఉమ్మడి జిల్లాలకు మేలు జరుగుతుందేమోనని ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కృష్ణాజిల్లా పురోభివృద్ధికి అవసరమైన కీలక ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడంతో అవి నత్తనడకన సాగుతున్నాయి. గన్నవరంలో అంతర్జాతీయ విమానాశ్రయం, నాగాయలంక మండలంలో మిస్సైల్ లాంచింగ్ సెంటర్, నిమ్మకూరులో బెల్ నిర్మాణాల పనులు ముందుకు సాగడంలేదు. కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నం అనుసంధానంగా కోస్తా లింకు రైలు మార్గం ప్రతిపాదనలు సుదీర్ఘకాలంగా ఆచరణకు నోచుకోవడం లేదు. కాకినాడ - కోటిపల్లి, అమలాపురం, రాజోలు, నరసాపురం మీదుగా మచిలీపట్నం - రేపల్లె, నిజాంపట్నం-బాపట్ల వరకు లింకు మార్గం ఏర్పాటు చేయాల్సి ఉంది. 164 కిలోమీటర్ల దూరానికి రూ.3,484.54 కోట్లు వ్యయం అవుతుందని దశాబ్దాల క్రితమే (మిగతా 2లో)

మచిలీపట్నంలో వరి పరిశోధనా క్షేత్రానికి ప్రభుత్వానికి కేటాయించిన భూములు

వరిసాగు పరిశోధనలు ముందుకు సాగేనా ?

- మచిలీపట్నం క్షేత్రం భూముల్లో మెడికల్ కళాశాల ఏర్పాటు
- ప్రత్యామ్నాయంగా అనువైన భూములు కేటాయించని ప్రభుత్వం
- మౌలిక వసతుల కల్పనపై నిర్లక్ష్యం
- ఇతర ప్రాంతాల వైపు అంతర్జాతీయ, జాతీయ వరి పరిశోధనా సంస్థల చూపు

ప్రజాశక్తి-కృష్ణా ప్రతినిధి: క్షార భూముల్లో సాగుకు అనుకూలమైన వరి వంగడాల రూపకల్పనకు జరిగే పరిశోధనలపై నీలి నీడలు కమ్ముకున్నాయి. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని ఈ పరిశోధనా క్షేత్రం భూములను గత ప్రభుత్వం మెడికల్ కళాశాలకు కేటాయించింది. కానీ పరిశోధనా కేంద్రానికి అనువైన భూములను కేటాయించి మౌలిక వసతులు కల్పించలేదు. దీంతో ఇక్కడి పరిశోధనల్లో భాగస్వామ్యం వహిస్తున్న అంతర్జాతీయ, జాతీయ వరి పరిశోధనా సంస్థలు ప్రయోగాలకు మరో ప్రాంతాన్ని ఎంపిక చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి.

దేశంలోని సముద్ర తీర ప్రాంతాల్లోని లక్షలాది ఎకరాల విస్తీర్ణంలో క్షార భూములు విస్తరించి ఉన్నాయి. ఆహార పంటల ఉత్పత్తి పెంచే క్రమంలో భాగంగా ఈ క్షారభూముల్లో సాగుకు అనుకూలమైన వరి విత్తనాలను రూపొందించడానికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు పాండిచ్చేరి, బెంగాల్, మహారాష్ట్ర, గోవా తదితర రాష్ట్రాల్లో ఐదు పరిశోధనా క్షేత్రాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాల్లో ప్రయోగాల ఫలితంగా ఉప్పు సాంద్రత 4 శాతం ఉన్న క్షార భూముల్లోనూ సాగుకు అనుకూలమైన వంగడాలు రూపొందాయి. రాష్ట్రంలో మొత్తం 9 లక్షల 88 వేల 400 ఎకరాల విస్తీర్ణంలో క్షార భూములు ఉండగా, వాటిలో 4 లక్షల 94 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగవుతోంది. మచిలీపట్నం పరిశోధనా క్షేత్రంలో రూపొందించిన ఎంసిఎం 100, 125, 103, 125 రకాలు క్షార భూముల్లోని ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతున్నాయి.

పరిశోధనలకు విఘాతం..విత్తనాలకు సమస్య

ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని మచిలీపట్నం రాడార్ కేంద్రం సమీపంలో 1955లో 26.94 ఎకరాల విస్తీర్ణాన పరిశోధనా క్షేత్రం ఏర్పాటు చేశారు. ఒక్కొక్కటి 800 చదరపు మీటర్ల (మిగతా 2లో)

లబ్ధిదారులకు టిడ్కో గృహాలను కేటాయించండి

- కలెక్టర్‌కు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి-విజయవాడ: టిడ్కో ఇళ్లకు మరమ్మతులు చేయించి లబ్ధిదారులకు కేటాయించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్లను అప్పగించిన ఆరు మాసాల తర్వాత నుండి బ్యాంక్ రుణాలు వసూళ్లు చేసే పద్ధతిని తీసుకురావాలన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి, స్వార్ధపూరిత చర్యలకు లబ్ధిదారులు ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. ఆరు సంవత్సరాలవుతున్నా టిడ్కో ఇళ్లు కేటాయించకుండా బ్యాంక్ రుణాలు చెల్లించాలనడం అన్యాయమన్నారు. 2018-19లో టిడిపి అధికారంలో ఉన్న సమయంలో నగరంలో ఇళ్లు లేని పేదలకు ఇళ్లు ఇస్తామని, టిడ్కో ఇళ్ల కోసం ఒక్కో కుటుంబం నుండి రూ.25 వేల నుండి 2 లక్షల రూపాయల వరకు డబ్బులు కట్టించుకున్నారని చెప్పారు. వేల రూపాయలు అద్దెలు చెల్లించి అద్దె ఇళ్లల్లో ఉంటున్న పేదలు అప్పులు చేసి ప్రభుత్వానికి లక్షల రూపాయలను చెల్లించారన్నారు. ఆ సందర్భంలో ఇళ్లు కేటాయిస్తున్నట్లుగా లబ్ధిదారులకు కాగితాలు అందచేశారన్నారు. ఇళ్ల అలాట్‌మెంట్ జరిగి నేటికీ ఆరు సంవత్సరాలు పూర్తయినా (మిగతా 2లో)

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు కాశీనాథ్

రాష్ట్రాన్ని గాడిలో పెడతాం

- మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

గత ప్రభుత్వం అప్రజాస్వామిక పాలన వల్ల ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నామని, రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం మచిలీపట్నంలోని అతిథి గృహంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా, ఉపాధి పరంగా అన్ని రంగాల్లో ఒక భరోసా కల్పించాలనే తపనతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వచ్చే ఒకటిన్నర సంవత్సరంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. అన్ని వసతులు కల్పించి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణనలోనికి తీసుకొని పూర్తిస్థాయి బడ్జెట్‌ను త్వరలో ప్రవేశపెడతామన్నారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగి రికార్డులు కాలిపోయిన సంఘటనపై విచారణ జరుగుతుందన్నారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్‌పై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణ జరుగుతుందన్నారు. మంత్రిని జిల్లా కలెక్టర్ డి కె బాలాజీ, జిల్లా పోలీసు అధికారి ఆర్ .గంగాధర్ రావు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు.

మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

టిడిపి నేతల వేధింపులు

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం వార్త 4లో

మొదటిపేజీ తరువాయి

ముందుకు సాగేనా ?

విస్తీర్ణంలో రెండు విత్తన గోడౌన్లు, విత్తనాలను ఆర బెట్టడానికి అవసరమై సిమెంట్ ప్లాట్ ఫారాలు నిర్మించారు. డెల్టాలో ఖరీఫ్, దాళ్వా వరికి సాగునీరు విడుదల చేస్తే రెండు విడతలుగా 400 క్వింటాళ్లు, ఒకసారి మాత్రమే విడుదల చేస్తే 200 క్వింటాళ్ల విత్తనాలు ఈ క్షేత్రంలో ఉత్పత్తి అయ్యేవి. ఇప్పుడు ఈ భూముల్లో మెడికల్ కళాశాలను నిర్మించారు. ఈ భూములకు ప్రత్యామ్నాయంగా ప్రయోగాల నిమిత్తం ప్రభుత్వం మచిలీపట్నం సమీపంలోని రుద్రవరంలో 16.34 ఎకరాల పల్లపు భూములను కేటాయించింది. దీనిలో ఆరెకరాలు మాత్రమే ప్రయోగాలకు అనుకూలంగా ఉంది. మిగిలిన భూమి అనుకూలంగా లేవు. ఇక్కడ భూముల్లో 12 శాతం ఉప్పు సాంద్రత ఉంది. దీని పరిసరాల్లో రొయ్యల చెరువులు ఉండటంతో సాగుకు అవసరమైన నీరు అందడం లేదు. ఉప్పు నీరు వస్తోంది. దీంతో నీరు పెట్టిన సమయంలో భూముల్లో 25 శాతానికి ఉప్పు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని జాతీయ వరిపరిశోధనా సంస్థల సహకారం, పర్యవేక్షణలో నూతన వంగడాల రూపకల్పనకు జరుగుతున్న పరిశోధనలు విఫలమయ్యాయి. నాటిన వెంటనే మొక్కలు చనిపోతున్నాయి.

ప్రయోగాలు ఇలా

నాలుగు శాతం సాంద్రత ఉన్న ఉప్పు భూముల్లో వంగడాల రూపకల్పన జరిగింది. ఫిలిప్పైన్స్, హైదరాబాద్ వంటి అంతర్జాతీయ, జాతీయ సంస్థలు, మచిలీపట్నం వరి పరిశోదనా క్షేత్రం శాస్త్రవేత్తల పర్యవేక్షణలో 12 శాతం సాంద్రతతో ఉన్న క్షార భూములకు అనుకూలమైన వంగడాలు రూపకల్పన జరుగుతున్నాయి. ఇప్పటి వరకు ఒక నూతన వంగడం రూపకల్పనకు 13 ఏళ్లు పట్టింది. తాజాగా ఐదేళ్లలోనే రూపొందించడానికి అవసరమైన ప్రయోగాలను చేస్తున్నారు. అయితే కేటాయించిన భూములు ప్రయోగాలకు అనుకూలంగా లేకపోవడంతో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు దేశంలో మరో ప్రాంతాన్ని ఎంపిక చేసుకునే ప్రయత్నాల్లో పడ్డాయి. నూతన ప్రభుత్వం చొరవ చూపి పరిశోధనా క్షేత్రానికి అవసరమైన సాగు నీటిని, మౌలిక వసతులను కల్పిస్తేనే ఇక్కడ పరిశోధనలు తిరిగి గాడిన పడే పరిస్థితి ఉంటుంది.

నిర్మలమ్మ కనికరిస్తుందా !

అంచనా వేసి నివేదికలు సిద్ధం చేశారు. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి డిపిఆర్ తయారీ చేయాలని కేంద్రం మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది. కానీ డిపిఆర్ తయారీకి అవసరమైన రూ.150 కోట్లు నిధులను మాత్రం విడుదల చేయలేదు.

గన్నవరం విమానాశ్రయాన్ని అంతర్జాతీయస్థాయిలో తీర్చిదిద్దాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. కానీ రాష్ట్ర విభజన తర్వాత ఈ విమానాశ్రయం అభివృద్ధి పనులు పెద్దగా ముందుకు సాగడం లేదు. వీటితోపాటు మచిలీపట్నంలో ఫిషింగ్ హార్బర్, నిమ్మకూరులో బెల్ కంపెనీ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. నాగాయలంక మండలంలో గుల్లలమోద వద్ద మిస్సైల్ లాంచింగ్ సెంటర్ నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. రెండేళ్ల నుండి దీని పనులు నిలిచిపోయాయి. మరోపక్క ఈ ప్రాజెక్టు గుజరాత్ తరలిపోతోందనే ప్రచారం సాగుతోంది.

ముందుకుసాగని పారిశ్రామిక కారిడార్

ఉపాధి అవకాశాల మెరుగుదలకుగాను పారిశ్రామిక వృద్ధికి కేంద్రం తోడ్పాటు అందించాల్సి ఉంది. విశాఖపట్నం – చెన్నై కోస్తా పారిశ్రామిక కారిడార్‌లో కృష్ణాజిల్లా భాగంగా ఉంది. కానీ ఈ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లాలోని పారిశ్రామికవాడలకు భారీగా భూములు సేకరించినా పరిశ్రమలు మాత్రం ఏర్పాటు కావడంలేదు. బాపులపాడు మండలం మల్లవల్లిలో 1200 ఎకరాల్లో ఏర్పాటు చేసిన మోడల్ పారిశ్రామికవాడ, 100 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఫుడ్‌పార్కుల్లో నామమాత్రంగానే పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. గన్నవరం మండలం వీరపనేనిగూడెం పారిశ్రామికవాడలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కేంద్రం రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తేనే ఆయా ప్రాంతాల్లో పరిశ్రమల వృద్ధికి అవకాశం ఉంటుంది.

ఎన్‌హెచ్ 216కు మోక్షం ఎప్పుడో!

గతంలో స్టేట్ హైవేగా ఉన్న మచిలీపట్నం, పెడన, గుడివాడ, హనుమాన్ జంక్షన్, నూజివీడు, తిరువూరు మండలం లక్ష్మీపురం వరకు ఉన్న రహదారిని జాతీయ రహదారి జాబితాలో చేర్చారు. నాలుగు జాతీయ రహదారులను కలుపుతూ సాగే ఈ రహదారిని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేసే పనులు ఇంకా ప్రతిపాదన దశలోనే ఉన్నాయి. పామర్రు – చల్లపల్లి మధ్య మరో రహదారిని కేంద్రం అభివృద్ధి చేయాల్సి ఉంది. ఈ రహదారులకు కేంద్రం నిధులు విడుదల చేయాల్సి ఉంది. కృష్ణాజిల్లాకు నీటి అవసరాలను తీర్చే పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయడానికి అవసరమైన నిధులను విడుదల చేయడంలేదు.

మెట్రో రైలుకు పచ్చజెండా ఊపేనా ?

రాజధాని ప్రాంతమైన విజయవాడ మెట్రో ప్రాజెక్టును కేంద్రం మరిచిపోయింది. నగరంలో మెట్రో రైలు ఏర్పాటుతోపాటు రాజధాని అమరావతికి రైల్వే లింక్ మార్గాన్ని విస్మరించింది. ఈసారైనా కేంద్ర ప్రాజెక్టుల నిర్మాణానికి, ఉమ్మడి కృష్ణాజిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులు కేంద్రం కేటాయిస్తుందనే ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న అధికారులు

కిడ్నీ మరణాలపై నివేదిక

అనుములంకలో మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి–గంపలగూడెం: ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెం మండలం అనుములంకలో కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కనకపూడి భారతి, కనకపూడి దాస్ ఆదివారం మృతిచెందడంతో బాధిత కుటుంబాలను జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి శివప్రసాద్‌యాదవ్, ఆరోగ్య శాఖ అధికారి సుహాసిని సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మంచినీరు సరఫరా కావడంలేదని, ఫ్లోరైడ్ నీటితో ఇబ్బందుల పడుతున్నాయని బాధితులు తెలిపారు. దీంతో స్థానిక పంచాయతీ కార్యదర్శి మరీదు హరిని అధికారులు ప్రశ్నించారు. గ్రామంలో పూర్వం నుండి ఉన్న ఆర్ఒ ప్లాంట్ మరమ్మతులకు గురైందని హరి వివరించారు. వెంటనే దానిని పునరుద్ధరించాలని ఆదేశించారు. గ్రామంలో కిడ్నీ వ్యాధితో మృతిచెందిన వారి వివరాలు, కారణాలు పరిశీలించి అధికారులు నివేదిక తయారు చేశారు. దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఫ్లోరైడ్ రహిత నీటిని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వారు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ వెంకటరమణ, ఈఈ ప్రసాద్, డిఇ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు టిడ్కో గృహాలను కేటాయించండి

గృహప్రవేశాలు జరగలేదన్నారు. అప్పులు చేసిన డబ్బులకు వడ్డీలు చెల్లిస్తూ, మరో పక్క వేల రూపాయలు అద్దెలు కడుతూ లబ్ధిదారులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. గత వైసిపి ప్రభుత్వం టిడ్కో ఇళ్ల మరమ్మతులు చేయించి వాటిని లబ్ధిదారులకు అప్పగిస్తామని చెప్పి ఒక్కో లబ్ధిదారుని పేరుతో రూ. 3.60 లక్షలు వివిధ బ్యాంకుల్లో రుణాలు తీసుకుందన్నారు. ఆ డబ్బును ఏం చేసారో విచారణ జరిపించాల్సి ఉందన్నారు. కుటుంబాలు గడవని పేదలకు ఇప్పుడు బ్యాంక్‌లు నోటీసులు ఇస్తున్నాయన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ టిడ్కో ఇళ్ల కేటాయింపు అంశం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

PUBLIC NOTICE DATED 7-7-2024

I am under the instruction of my client Sri Saripalli Jayarami reddy S/o Srimannaraya Reddy of Gowri sankar puram, D/o 10/32-1, Guduvada Town to issue the following public notice.

My client's son saripalli Arun kumar purchased dryland in an extent of Ac.0.80 cents in R.S NO.186/3 of kuntamukkala Village, G.konduru Mandal, N.T.R .District. From kalidasu Venkateswara Rao and his children under sale deed dated 28-12-2018 (doc No.7307/2018 on the file of sub. Reg. mylavaram). He entrusted the original document to my client while he was appointed as his G.P.A. holder through registered G.P.A deed dated 25-5-2023 (doc. No.3315/2023 on the file of Sub.Reg. mylavaram). While my client was traveling from Gudivada to mylavaram by bus, on 17-5-2024 he found that he lost the original sale deed referred to above. A police report was given in mylavaram police on 6-7-2024 and investigation by the police is going on.

Those who come across the said document are requested to hand over the same either to my client is to me. If any person tries to deal with such document, such deal will not be binding on my client. This is for general information to the public.

Vijayawada
Dated 7-7-2024.

Address for the counsel
B. Koti Reddy, B.Sc.,B.L.
Advocate
Ammana Estates, Museum Ratnakar
Governer pet, Vijayawada-2.
Cell : 94901 48500

IN THE COURT OF THE ADDITIONAL CIVIL JUDGGE (JUNIOR DIVISION):: GANNAVARAM.
OS. NO. 74/2022

BETWEEN:
ANNAVARAPU VENKATRAMAIAH ... PLANITIFF
AND
KATHI NAGAMANI AND OTHERS ... DEFENDANTS

To,
D2) Gorji Sivaji, S/o. Pentaiah, R/o. Door No. 2-203, Vangurula Lakshmi pathi veedi, Ramavarappadu, Vijayawada, NTR District.
D3) Gorji Radha, W/o.Juvvanapudi Kiran Kumar, R/o. Door No. 2-203, Vangurula Lakshmi pathi veedi, Ramavarappadu, Vijayawada, NTR District.
D4) Gorji Sirisha, W/o.Deepak Pawar, R/o. Door No. 2-203, Vangurula Lakshmi pathi veedi, Ramavarappadu, Vijayawada, NTR District.

పై నెంబరు దావాని వాదులు, ప్రతివాదులు పై డిక్లరేషన్ మరియూ పర్మినెంట్ ఇంజక్షన్ కొరకు పై కోర్టులో దాఖలు చెయ్యగా, సదరు కోర్టువారు పై దావా విషయములు తెలియజేయుట కొరకు మీకు సమనులును పేపర్ పబ్లికేషన్ ద్వారా మీ నోటీసు నిమిత్తం ది. 27-8-2024కి వాయిదా వేసినారు. కనుక మీరు ది. 27-8-2024 తేదీ నాడు ఉదయం 10-30 గం.ల నుండి పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, మీ ప్లీడర్ గారి ద్వారా గానీ హాజరు అయి మీకు గల ఆక్షేపణలను తెలుపుకోవలసినది. లేనియెడల మీ పరోక్షమున పై నెంబరు కేసు తీర్మానించబడునని ఇందుమూలంగా మీకు తెలియజేయటమైనది.

వాయిదా తేదీ.27-08-2024.

జి.రామకృష్ణ,
వాదులు తరఫు న్యాయవాది,
అడ్వకేట్, మంగళగిరి.

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION, KADAPA
C.C.No.39/2024

Ammireddy Malleswaramma, W/o Late, Ammi reddy Narayana Reddy, Hindu, Resident of D.No. 1/59, Dayankhanpalli, Mydukur Mandal, Kadapa District. **...Complainant**

Vs

The Government of A.P. rep.by its Director Y.S.R. Bima Scheme, 4th Floor, PNB Terminus, Vijayawada.

...Opposite Party No.2

NOTICE TO OPPOSITE PARTY NO.2

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా పై తెలిపిన కంప్లైనెంట్ మీ మీద పై కోర్టులో వైఎస్ఆర్ బీమా నష్టపరిహారం కేసు వేసి వున్నారు. సదరు కేసు వాయిదా 30.07.2024న వున్న ది. మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల పై తెలిపిన కోర్టులో స్వయంగా కాని వకీలు ద్వారా కాని 30. 07.2024 ఉదయం 10.30లకు ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిఎడల మీ పరోక్షంగా తీర్మాణించబడును.

//By Order of the District Commission//
బి.మురళీధర్
అడ్వకేట్, కడప.

IN THE COURT OF THE PRL CIVIL JUDGE AT GUDIVADA (JUNIOR DIVISION)
O.S.No. 87/2023

Between:
Bank of Baroda, Gudivada Branch,
Rep. by its Chief Manager.
Gudivada J.C.J.C. ...... Plaintiff
AND
1. Lakshmi Enterprises, Prop. Mekala Vijayasagar Reddy, S/o. M. Veera Raghavar, Reddy
Hindu, aged 53 years, Business,
R/o.2/63, Nuzvid Road, Bapulapadu Mandal, Krishna Dist.
2. Mekala Vijayasagar Reddy,
S/o. M. Veera Raghavar Reddy Hindu,
aged 53 years, Business,
R/o.2/63, Nuzvid Road, Bapulapadu Mandal, Krishna Dist. ....Defendants

పై నెంబరు దావాలో డిఫెండెంట్లకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకోనందున పేపర్ ప్రకటన ద్వారా సమన్లు అమలు జరుపుటకు శ్రీ కోర్టువారు ఉత్తర్వులు ఇచ్చియున్నందున ఇందుమూలముగా తెలియజేయటమైనది. కావున ది. 26-07-2024వ తేదీన ఉదయం 10-30 గంటలకు పై కోర్టువారి ఎదుట డిఫెండెంట్లకు స్వయముగా గాని, మీ తరపున న్యాయవాది గాని, హజరై ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల పై నెంబరు దావా పరోక్షముగా తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది : 26-07-2024 **ఇట్లు**
శ్రీ జి.యల్.యన్.వి.అప్పాజి, బి.కామ్,, బి.యల్.
వాది తరపు న్యాయవాది, గుడివాడ.

ప్రకటన

నా (మా) క్లయింట్లయిన శ్రీమతి డిల్లీ రత్నమాణిక్యమ్మ, భర్త : లేటు నాగేశ్వరరావు, నివాసం : విశాఖపట్నం. (2) డిల్లీ శ్రీనివాసరావు గారు, తండ్రి : లేటు రాధాకృష్ణ, నివాసం : వెన్ననపూడి గ్రామం, నందివాడ మండలం, కృష్ణాజిల్లా (3) శ్రీ డిల్లీ వెంకట సూర్యనారాయణ, తండ్రి : లేటు వెంకయ్య, నివాసం : వెన్ననపూడి గ్రామం, నందివాడ మండలం, కృష్ణాజిల్లా మరియు (4) డిల్లీ శేషుబాబు గారు తండ్రి : వెంకయ్య (లేటు), నివాసం : ఏలూరు రోడ్డు, గుడివాడటౌన్ ఇచ్చినటు వంటి సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియ జేయునది ఏమనగా :

నా క్లయింట్లు ఈ దిగువ షెడ్యూలు ఆస్థిని వారి యొక్క సమీప బంధువులైన అనగా 1వ క్లయింటుకు వదినగారు, 2వ క్లయింటుకు మేనత్తగారు మరియు 3, 4 క్లయింట్లకు పెద్ద అక్కయ్య గారు అయినటువంటి శ్రీమతి లేటు కుక్కల గంగారత్నం గారికి హిందూ జాయింటు కుటుంబ వారసులైనందున మరియు పై చెప్పబడిన గంగారత్నం గారు విధవగాను మరియు నిస్సంతువుగాను కాలధర్మం చెందినందున ది. 10-02-2022 (2022వ సం॥, ఫిబ్రవరి 10వ తేదీ)న రిజిష్టర్డు పార్టీషను దస్తావేజు ద్వారా దాన, దమన, విక్రమయ, వినిమయాది అబ్సట్యూట్ స్వాధీన, హక్కు భుక్తములతో సమ వాటాలకు వారసత్వమును పొందియున్నారు.

కావున సదరు దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైన ఎటువంటి అభ్యంతరములు వున్న యెడల ఈప్రకటన పబ్లిష్ అయినటువంటి సకాలంలో ప్లీడరుగారి ద్వారా గానీ మరి ఏ విధంగానైనా అనగా (కోర్టు ఇంజక్షన్ ఆర్డర్) వగైరాల ద్వారా తమకు గల అభ్యంతరములను తెలియజేయగలరని, అట్లు చేయని పక్షంలో నా (మా క్లయింట్ల) పై చెప్పబడినటువంటి పార్టీషన్ రిజిష్టర్డు దస్తావేజులోని వారికి (నా క్లయింట్లకు) గల సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములననుసరించి నా క్లయింట్లు వారి ఇష్టానుసారంగా వ్యవహరించగలరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

కృష్ణాజిల్లా, గుడివాడ సబ్ రిజిష్టర్ వారి ఇలాకా గుడివాడ ప్రస్తుత మునిసిపల్ లిమిట్స్‌లోని ఎన్‌టిఆర్ కాలనీ అనగా వార్డు నెం. 6లోని పాత వలివర్తిపాడు గ్రామపంచాయతీ ఆర్.ఎస్. నెం.263/2 మరియు మున్సిపల్ సమీప డోర్ నెం.6/1-2ఎ వద్ద ఉన్నటువంటి 608 చ॥గ॥ హద్దులు
తూర్పు : మురుగుడు ఈశ్వరరావు
ఉత్తరం:మెరుగుమాల పుల్లయ్యగారి స్థలం 25 లింకులు
పడమర : మున్సిపల్ సిసి రోడ్డు
దక్షిణం : నల్లిబోయిన కేశవరావు గారి స్థలం 360 చ॥గ॥లు.

పై స్థలం యొక్క సుమారు మార్కెట్ వాల్యూ రూ. 47,42,400-00 లు (అక్షరాల నలుబది ఏడు లక్షల, నలభై రెండువేల, నాలుగు వందల రూపాయలు).
తేది :22-07-2024
స్థలం : గుడివాడ.

ఇట్లు
శ్రీమతి డి.జులేఖ, బి.కాం., బి.ఎల్.,
అడ్వకేట్, గుడివాడ.

గ్రామపంచాయతీ కార్యాలయం, కపిలేశ్వరపురం
టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి. నెం. **10/2024** తేది : **22-7-2024**

కృష్ణాజిల్లా, పమిడిముక్కల మండలం, కపిలేశ్వరపురం గ్రామపంచాయతీ నందు ఈ దిగువ తెలిపిన పనులకు కాంట్రాక్టు పద్ధతిపై పని చేయుటకు కపిలేశ్వరపురం గ్రామపంచాయతీ కార్యాలయం నందు 01-08-2024 ఉదయం 12 గం.ల నుండి 1 గం. వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. అదేరోజు 2 గం.లకు హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. సదరు టెండరు కార్యదర్శి వారిచేగాని లేదా వారి అనుమతి పొందిన వారిచేగానీ స్వీకరించబడును. ఇతర విషయములు ఆఫీసు పనివేళల యందు తెలుసుకొనవచ్చును. టెండరు ధరావత్తులు చెల్లించని వారి టెండర్లు స్వీకరించబడవు.

వ.నెం.	పనివివరములు		కాలము	ధరావత్తు
1.	ఎలక్ట్రీషియన్	- 01	ది. 01-04-2024 నుండి ది.31-03-2025 వరకు	500
2.	ట్యాంక్ ఆపరేటర్లు	- 04		
3.	ట్రాక్టర్ డ్రైవర్	- 01		
4.	స్వీపర్లు	- 06		
	మొత్తము	12		

నోట్ : 1) నెలవారీ జీతములు గ్రామపంచాయతీ నిధుల సౌలభ్యతను బట్టి చెల్లించబడును.

సం/- ఎం.ఎస్.విద్యాధర్, పంచాయతీ కార్యదర్శి,
కపిలేశ్వరపురం, పమిడిముక్కల మండలం

మహిళలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలోని అన్ని పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులు నివారించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహిం చిన మీకోసం కార్యక్రమంలో జిల్లా మహిళా అభివద్ధి శిశు సంక్షేమ శాఖ రూపొందించిన పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు చట్టం 2013 గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ మహిళలపై లైంగిక వేధింపులు నివారించేందుకు ప్రభుత్వం 2013లో చట్టం తీసుకొచ్చిందన్నారు. జిల్లా స్థాయిలో స్థానిక కమిటీని కూడా ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. కమిటీల పనితీరును పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో 29 మంది నోడల్ అధికారులను నియమిం చామన్నారు. మహిళల పట్ల లైంగిక వేధింపులుగాని, భౌతిక రూపంలోగానీ సంభాషణ రూపంలో గానీ ఇతరత్రా వేధించినట్లయితే అటువంటి వారిపై కఠిన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, ఆర్డీవో ఎం వాణి, ఐ సి డి ఎస్ పి డి సువర్ణ, డి.ఎస్.ఓ. పార్వతి, డి ఎం హెచ్ ఓ డాక్టర్ గీత బాయి, కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, డ్వామా పీడీ జివి సూర్యనారాయణ, డిపిఓ నాగేశ్వర్ నాయక్ పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డికె బాలాజీ, అధికారులు

23 నుండి ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి-గన్నవరం : ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు గన్నవరం మండలంలో ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సత్య కుమార్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ 23,24 తేదీల్లో సావరగూడెం, బుద్ధవరం వన్, పురుషోత్తపట్నం, గన్నవరం, చిన్న అవుటపల్లి గ్రామాల్లో ఆధార్ క్యాంప్ జరుగుతుందన్నారు. 25,26 తేదీల్లో ముస్తాబాద, బుద్ధవరం 2, కేసరపల్లి, కొండపావులూరు,తెంపల్లి గ్రామ సచివాలయాల్లో క్యాంపు ఉంటుందని తెలిపారు. ఆధార్లో చేర్పులు, మార్పులు, కొత్త ఆధార్ కార్డులు, కావలసినవారు ఈ క్యాంపును ఉపయోగించుకోవాలని తెలిపారు.ప్రజాశక్తి -ఘంటసాల : ఘంటసాల మండలంలోని 13 గ్రామ సచివాలయాల్లో ఈ నెల 23వ తేదీ నుండి 27వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎండివో బి.మారుతి శేషమాంబ సోమవారం తెలిపారు. 23వ తేదీన ఘంటసాల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఘంటసాల-1, ఘంటసాల -2, ఘంటసాలపాలెం, మల్లంపల్లి, 24వ తేదీన చిట్టూర్పు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద చిట్టూర్పు, దేవరకోట గ్రామాల వారికి, 25న లంకపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద లంకపల్లి, దాలిపర్రు, పూషడం, యండకుదురు, మల్లాయిచిట్టూరు గ్రామాల వారికి, 26న కొడాలి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కొడాలి, చినకళ్లేపల్లి, వేములపల్లి, తాడేపల్లి, కొత్తపల్లి గ్రామాల వారికి, 27వ తేదీన శ్రీకాకుళం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శ్రీకాకుళం, తెలుగురావుపాలెం, పాపవినాశనం, గోగినేనిపాలెం, అచ్చెంపాలెం గ్రామాల వారికి క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకు ఈ క్యాంపులు ఉంటాయన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-అవనిగడ్డ : సమాచార హక్కు చట్టంపై ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, రైతులు అవగాహన పెంచుకోవాలని తాసిల్దార్ మల్లేశ్వరరావు సూచించారు. సోమవారం మండల పరిషత్ సమావేశం హాల్లో సమాచార హక్కు చట్టంపై అధికారులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించార.ు సమాచార హక్కు చట్టం కమిషనర్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఏడిఏ జెఎస్ జయప్రద అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తాసిల్దార్ పాల్గొని సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పారదర్శకంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారానికి సంబంధించి గోప్యత పాటించాలని, ప్రభుత్వం ప్రజలకు సంబంధించి తెలియాల్సిన విషయాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. అదేవిధంగా ఏ సమాచారం అందించాలి ఏది అందించకూడదనే విషయం పట్ల కూడా అవగాహన ఉండాలన్నారు. ప్రజలు రైతులు తమకు సంబంధించిన సమాచారం కోరినప్పుడు విధివిధానాల ప్రకారం తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం మరియాదేవి, మండల వ్యవసాయ శాఖ అధికారి వి శౌర మ్మ, గ్రామ రెవెన్యూ అధికారులు కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై
వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ ఎస్సి హాస్టల్‌లో వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల విద్యార్థిని అదశ్యం అయ్యిందని దానికి కారణమైన ఎస్సీ హాస్టల్ వార్డెని వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ కష్ణా జిల్లా కార్యదర్శి ఎస్ సమరం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమరం మాట్లాడుతూ కష్ణాజిల్లా గుడివాడ మండలంలో లింగవరం రోడ్ లో ఉన్న ఇంటర్ విద్యార్థిని ఎస్సీ హాస్టల్లో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో విద్యార్థిని మిస్సింగ్ అవ్వటం అనేక కారణాలకి దారితీస్తుందన్నారు. ప్రధానమైన కారణం హాస్టల్లో వార్డెన్ లేకపోవడమని, సిబ్బంది, నైట్ వాచ్మెన్ వీరెవరు విద్యార్థినిలను పట్టించుకోకపోవడం వలన విద్యార్థి అదృశ్యమైందంన్నారు. దీని మీద అధికారులు వెంటనే స్పందించి దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మిస్సింగ్ అయిన విద్యార్థినిని పట్టుకుని వారి తల్లిదండ్రులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కష్ణా జిల్లా వ్యాప్తంగా ఉన్న హాస్టల్స్ అన్నిటిని అధికారులు సందర్శించి వాటి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎక్కడైతే బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న హాస్టల్ వార్డెన్‌లు ఉన్నారో వాళ్ళని వెంటనే విధుల నుంచి తొలగించాలని, నైట్ కూడా హాస్టల్లో వార్డెన్లు నిద్రించేలా చేయాలని విద్యార్థినినీలకు విద్యార్థులకు రక్షణ కల్పించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కష్ణాజిల్లా ఉపాధ్యక్షులు సలీం,గుడివాడ మండల కార్యదర్శి సమీర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ సమరం

రమేష్ బాబు పుట్టినరోజు వేడుకలు

కేక్ కట్ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ సింహాద్రి రమేష్ బాబు జన్మదిన వేడుకలు అవనిగడ్డ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ సర్పంచ్ గోరుముచ్చు ఉమా, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లి శ్రీనివాసరావు కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు కార్యకర్తలకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు వెళ్లి వైద్యశాలలోని రోగులకు సూపర్డెంట్ జై కుమార్ చేతుల మీదుగా పండ్లు రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధా రంగ మిత్రమండలి దివి యూనిట్ అధ్యక్షులు రాజనాల మాణిక్యాలరావు, పులిగడ్డ రామచంద్రపురం సర్పంచులు దాసరి విజయ్ కుమార్, వాకా రమేష్, పార్టీ జిల్లా రైతు విభాగం నాయకులు సామర్ల రాముడు తదితరులు పాల్గొన్నారు

వర్షపు నీరు తొలగించాలని వినతి

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధి కొడాలి గ్రామపంచాయతీలోని ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాలుకు ముందు ఉన్నటువంటి ఖాళీ స్థలంలో వర్షపు నీరు నిల్వ ఉండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జనసేన పార్టీ మండల అధ్యక్షులు కోన రాజశేఖర్ అన్నారు. వర్షపు నీరు తొలగించాలని కోరుతూ సోమవారం సర్పంచ్ చలపాటి రాణికి, పంచాయతీ కార్యదర్శి సిహెచ్.వి. ఎస్.నాగమణిలకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కోన రాజశేఖర్ మాట్లాడుతూ మురుగు వాసన కారణంగా దోమలతో ఇబ్బందిగా ఉంటుందని, ఇక్కడి పరిస్థితిని అర్థం చేసుకుని ఆ వర్షపు నీటిని తొలగించాలని కోరారు. అలాగే రోడ్లపై, నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో బ్లీచింగ్ చేయవలసిందిగా కోరారు.

ఆర్ఐకు సత్కారం

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండల రెవెన్యూ ఇన్సెపెక్టర్ రవికుమార్ సచివాలయం నుండి శిక్షణ నిమిత్తం పెదపారుపూడి మండల రెవెన్యూ కార్యాలయానికి వచ్చి ఒక సంవత్సరం కాలం శిక్షణ పూర్తి చేసుకుని తిరిగి సచివాలయంలో సెక్షన్ఆఫీసర్‌గా విధులు నిర్వహించడానికి వెళుతున్న ఆర్ఐని సోమవారం సత్కరించారు. సత్కరించిన వారిలో మండల తహసిల్దార్ కె.వి మాధవరావు, డిప్యూటీ తహసిల్దార్ టి వాణి, సర్వేయర్, వీఆర్వోలు, విఆర్ఏలు, శాలువాలతో, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం సూరంపల్లి వద్ద పోలవరం కాలువ లో ఓ గుర్తు తెలియని శవం సోమవారం కనిపించింది. సూరంపల్లి గ్రామం రెవెన్యూ అధికారి కస్తూరి అర్జునరావు గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన సమాచారం మేరకు గన్నవరం పోలీసులు సంఘటన స్థలానికి వచ్చారు. పోలవరం కాలువలో నూజివీడు నుండి విజయవాడ రోడ్డు లో సూరంపల్లి వంతెన వద్ద మగ వ్యక్తి శవాన్ని బయటకు తీయించారు. సుమారుగా 40-45 వయస్సు కలిగి ఉండి , ఎత్తు సుమారుగా 5.5 అడుగులు, జుట్టు నలుపు, రంగు చామనచాయ, దుస్తులు. సిమెంటు రంగు చొక్కా మీద నలుపు రంగు చారలు, లైట్ బ్లాక్ అండ్ బ్లూ కలర్ ప్యాంటు, ప్యాంటుకు నలుపు రంగు బెల్టు కలిగి ఉన్నాడని ఎస్సై శివప్రసాద్ తెలిపారు. ఈ వ్యక్తి యొక్క సమాచారం ఎవరికైనా తెలిసిన యెడల గన్నవరం పోలీసులకు (08676-252333) గాని, గన్నవరం ఎస్ఐ (9440627042) గాని , గన్నవరం సిఐ (9440627041) నెంబర్లకు సమాచారం తెలియపరచాలని కోరారు.

నివాళులు అర్పిస్తున్న పార్టీ నాయకులు

సిపిఎం సభ్యుడు రాజా మృతి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామానికి చెందిన సిపిఎం సభ్యులు బొడ్డు రాజా (35) సోమవారం ఉదయం 10 గంటలకు గుండెపోటుతో మరణించారు. పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కళ్ళం వెంకటేవరరావు, గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, మండల కమిటీ సభ్యులు కైలే ఏసుదాసు, కళ్లం రాంబాబు, గ్రామ పార్టీ నాయకులు బొడ్డు బాలశౌరి, బొతుల నాగరాజు, బొడ్డు వెంకటరత్నం తదితరులు రాజా భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ జెండాను కప్పారు. గ్రామంలో జరిగిన అనేక ఉద్యమాల్లో రాజా పాల్గొన్నారు అని వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామంలోని స్మశాన వాటికలో అతని భౌతిక కాయానికి అంతిమక్రియలు నిర్వహించారు.

రోడ్డుపై దిమ్మెలు తొలగించాలని నిరసన

ప్రజాశక్తి - గుడివాడ : గత 25 సంవత్సరాల నుండి టైలరింగ్ వీధిలో జీవనం సాగిస్తున్న టైలర్లు, చిరువ్యాపారులకు ఇబ్బందిగా ఉన్న పాత తాజ్‌మహల్ హోటల్ ఎదురుగా ఉన్న రోడ్డుపై పెట్టిన దిమ్మల వల్ల ఇబ్బందులకు గురవుతున్నామని, వాటిని తొలగించాలని 33వ వార్డు టిడిపి ఇన్‌చార్జి కోడూరి ప్రభు, టైలర్ అసోసియేషన్ అధ్యక్షుడు లంకపల్లి లాజర్, వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, గద్దం శ్రీనివాసరావులు కోరారు. సోమవారం స్థానిక టైలరింగ్ వీధికి అడ్డంగా పోలీసులు ఏర్పాటు చేసిన దిమ్మల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ పేరుతో ఇలా రోడ్డు మధ్యలో ఉన్న రాహదారికి అడ్డంగా దిమ్మలను ఏర్పాటు చేయడం వల్ల తాము ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ నిరసనలో వెలగల నాగేశ్వరరావు, ఎం.ఆర్ మోహనరావు, జె.సత్యనారాయణ, అలమూరి మురళీకృష్ణ, తాడేపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న టైలర్స్, చిరు వ్యాపారస్థులు

ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని తొలగించాలి

50 వడివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు

స్తంభాన్ని పరిశీలిస్తున్న సత్యబాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : బంక కామరాజు వీధిలో వాలిపోయి ప్రమాదకరంగా ఉన్న బిఎస్ఎన్ఎల్ స్తంభం తొలగించి ప్రజలకు రక్షణ కల్పించాలని 50 వడివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు కోరారు. 50వ డివిజన్‌లో పర్యటనలో భాగంగా ఈ విషయాన్ని ఆయన గమనించి పరిశీలించారు. బిఎస్ఎన్ఎల్ అధికారులు వెంటనే ప్రమాదకరంగా ఉన్న ఈ స్తంభాన్ని తొలగించి ప్రజలకు రక్షణ కల్పించాలని అన్నారు. అనంతరం బిఎస్ఎన్ఎల్ ఎఇకి విషయం తెలిపారు. సత్యబాబు వెంట ఈ పర్యటనలో సిపిఎం నాయకులు పి. రాజు తదితరులు పాల్గొన్నారు.

వెంటనే డిపాజిటర్లకు డబ్బులు చెల్లించండి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : మీ బ్యాంక్ నుంచి అప్పులు తీసుకుని తిరిగి చెల్లించని వారి ఆస్తులను వేలం వేయం డి.. డిపాజిట్‌దారుల సొమ్ము వడ్డీతో సహా చెల్లించండి.. ఇక జాప్యం చేస్తే సహించేది లేదు...' అని ది దుర్గా కో ఆపరేటివ్ బ్యాంక్ ప్రతినిధులను సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం కొత్తపేట లెనిన్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన ది దుర్గా కో ఆపరేటివ్ బ్యాంక్‌పై నమ్మకంతో రిక్షా కార్మికుడి నుంచి రిటైర్డ్ ఉద్యోగుల వరకు అన్ని వర్గాల ప్రజలు దాదాపు రూ.10వేల మంది రూ.40 కోట్ల మేర డిపాజిట్లు చేశారని చెప్పారు. ది దుర్గా కో ఆపరేటివ్ బ్యాంక్ ఖాతాదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వన్‌టౌన్ రమణయ్య కూల్ డ్రింక్స్ షాపు సెంటర్‌లో ఉన్న ఆ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ వద్ద బాధితులు ధర్నా చేశారు. సిపిఐ నగర నాయకులతో కలిసి జి.కోటేశ్వరరావు ధర్నా చేస్తున్న వారి వద్దకు వెళ్లి వారికి మద్దతు తెలిపారు.

ఎన్‌ఎఫ్‌సి చిప్ డోనర్ కార్డ్స్ పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానంలో దాతలకు మెరుగైన సేవలు అందిం చేందుకు గానూ కరూర్ వైశ్య బ్యాంక్ సౌజన్యంతో అమరా వతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ సంస్థ తయారు చేసిన సాఫ్ట్‌వేర్‌ను ఎన్‌ఎఫ్‌సి డోనార్ కార్డులను ఆలయ డోనార్ సెల్‌లో సోమవారం ఆలయ ఇఒ కె.ఎస్.రామారావు, కెవిబి బ్యాంకు ఎమ్‌డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డోనార్ సెల్‌లో అమ్మవారి చిత్రపటం వద్ద ఆలయ వైదిక సిబ్బందిచే పూజలు నిర్వహించిన అనంతరం వీరు ఎన్‌ఎఫ్‌సి చిప్ కలిగిన డోనార్ కార్డును ప్రింట్ చేసి, మొదటి కార్డును మెరుగు గోపాల్‌కి ఆలయ ఈఈ ద్వారా అందజేశారు. దేవస్థానానికి కూరగాయలు సప్లై చేసిన దాతకు కార్డు అందజేశారు. ఈ కార్డులో దాత సమాచారం, ప్రివిలైజేషన్స్, నిక్షిప్తమై ఉంటుంది. ఆలయ సమాచారం, దర్శనం, సేవలు, ఇతర సర్వీసుల పొందేందుకు సులభంగా, సెక్యూర్డ్‌గా ఉంటుందని తెలిపారు. అనంతరం వీరికి ఆలయ ఇఒ అమ్మవారి దర్శనం, వేదాశీర్వాచనం చేయించి, ప్రసాదం, శేషవస్త్రం చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో కెవిబి బ్యాంకు అధికారులు, అమరావతి సాఫ్ట్‌వేర్ కంపెని సిఇఒ సిహెచ్.అనిల్, సిబ్బంది, ఆలయ ఈఈ కెవిఎస్ కోటేశ్వరరావు, ఆలయ ఎఇఒలు, సిబ్బంది, ఎండీ అండ్ సీఈఓ బి రమేష్ బాబు , డివిజనల్ మేనేజర్ కె వి ఎస్ ప్రసాద్ , ఎస్బీజీ క్లస్టర్ హెడ్ మురళి , సీబీయూ హెడ్ వెంకట సుబ్బయ్య, వన్‌టౌన్ బ్రాంచ్ మేనేజర్ వీరభద్ర రావు గుప్త పాల్గొన్నారు.

విద్యార్థినికి సాయం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : 47వ డివిజన్ ఐజాక్ వీధిలో నివసిస్తున్న డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న ఒరుసు చిన్ని అనే విద్యార్థినికి టిడిపి నాయకులు రూ.6 వేలు ఆర్థిక సాయం అందజేశారు. తల్లి గతంలో మృతిచెందగా తండ్రి ఫీజులు చెల్లించలేని స్థితిలో ఉండగా ఈ సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కూటమి సభ్యులు అశోక్ రాజు, డి.సాయి, ముత్యాల రాము, యెడ్ల సీంహచలం పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - విజయవాడ : పని భారం, చాలీ చాలనీ వేతనాలు, కనీస సదుపాయాలు లేక మునిసిపల్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యల పరిష్కారానికి సంబంధిత విఎంసి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ అన్నారు. విఎంసిలోని శానిటేషన్‌లోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు కార్మికులతో కలిసి నేతలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ... మునిసిపల్ కార్మికులు పని భారం, చాలీ చాలని వేతనాలు, అధిక ధరలు, అధికారుల వేధింపులతో మునిసిపల్ కార్మికుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయని పేర్కొన్నారు. పారిశుద్ధ్యం, వెహికల్ డిపో డ్రైవర్లు, క్లీనర్‌లో మెకానికల్, పార్క్ సెక్షన్, వాటర్ సప్లై, డ్రైనేజీ, స్ట్రీట్ లైటింగ్,టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో పని చేస్తున్న కార్మికులకు ఏ విధమైన గుర్తింపు కాని, తగిన వేతనాలు లేవన్నారు. ప్రమాదాల్లో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని పలు సార్లు కోరినా కానీ అమలు చేయడం లేదని అన్నారు. సాధారణంగా మరణించిన కార్మికుల కుటుంబాలకు 2 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆ కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. మట్టి ఖర్చులు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో యూనియన్ నగర అధ్యక్షులు ఎస్.జ్యోతి బసు, యూనియన్ ఆర్గనైజ్ సెక్రెటరీ టి.ప్రవీణ్, నగర ఉపాధ్యక్షుడు వి.సాంబులు, వెహికల్ డిపో అధ్యక్ష కార్యదర్శులు కొండా హరిబాబు, జలసూత్రం నాగరాజు, నాయకులు గుర్రం కరిముల్లా, కిషోర్, సుందరయ్య, భాషా, చిన్న, వెంకట్రావు, బ్రహ్మయ్య, కెజై.రావు, కృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నేతల వేధింపులు... ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - మైలవరం : అడిగిన డబ్బులు ఇవ్వాలని లేదంటే అవకతవకలకు పాల్పడినట్లు నింద మోపి విధుల నుంచి తొలగిస్తామంటూ టిడిపి నాయకులు బెదిరిస్తున్నారని ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వికలాంగుడు ఆత్మహత్యాయత్నం చేశారు. తన చావుకు టిడిపి నాయకుడు కారణమని సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యా యత్నం చేశాడు. ఈ ఘటన మండలంలోని గణపవరం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గంగరాజు సూసైడ్ నోట్లో రాసిన వివరాలు ప్రకారం గణపవరం గ్రామానికి చెందిన వికలాంగుడు తన్నీరు గంగరాజు 15 సంవత్సరాలుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఉన్నాడు. గంగరాజుకు భార్య, వృద్ధులైన తల్లిదండ్రులున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు నంబూరి శ్యాంప్రసాద్ నుంచిగంగరాజుకు వేధింపులు ప్రారంభమయ్యాయి. వైసిపికి అనుకూలంగా ఉన్నాడని విధుల నుండి తప్పిస్తా మంటూ గంగరాజుపై శ్యాం ప్రసాద్ బెదిరింపులకు దిగాడు. ఉపాధి హామీ పథకంలో అవకత వకలకు పాల్పడు తున్నట్లు ఎంపిడిఒకు ఫిర్యాదు చేయించాడు. గంగరాజును విధులు నుండి తప్పించకుండా ఉండాలంటే రూ.35 వేలు ఇవ్వాలని బెదిరిస్తున్నట్లు నోట్‌లో పేర్కొన్నాడు. సోమవారం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు గంగరాజును 108 వాహనంలో మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు.

చికిత్స పొందుతున్న గంగరాజు



అర్జీదారుల సంతృప్తే ప్రధానం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించడం ముఖ్యమని కలెక్టర్ డా. జి.సృజన అన్నారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సృజన, డిఆర్ఒ వి.శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల డిఎం జి.వెంకటేశ్వర్లు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, హౌసింగ్ పీడీ రజనీకుమారి తదితరులతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి మొత్తం 90 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశ గడువులోగా నాణ్యంగా పరిష్కారం చూపాలన్నారు. జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు.

డిగ్రీ కోర్సులకు అనుమతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని శ్రీమతి గెంటేల శకుంతలమ్మ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యా శాఖ, కృష్ణ విశ్వవిద్యాలయం నూతన డిగ్రీ కోర్సులకు అనుమతి ఇచ్చినట్లు కళాశాల అధ్యక్షులు అండ్ కరెస్పాండెంట్ సామినేని ఉదయబాను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి గానూ బిఎస్‌సి హానర్, బీఎస్సీ ఫుడ్ అండ్ టెక్నాలజీ, బిఎస్‌సి హానర్ డేటా అనలిటిక్స్, బీకాం హనర్స్ (ఫైనాన్స్), బిఎస్సి హనర్స్ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), బిఎస్సి హనర్స్ (ఎలక్ట్రానిక్స్) మొదలగు కోర్సులలో చేరేవారు కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

మూడు దశాబ్దాల చరిత్రల గల

కళాశాల కునారిల్లుతోంది

ప్రజాశక్తి - గంపలగూడెం : మూడు దశాబ్దాలు చరిత్ర కలిగిన ఆ ప్రభుత్వ కళాశాల కునారిల్లుతూ వైద్యానికి ఎదురుచూస్తోంది. నాటి ఉప ముఖ్యమంత్రి కోనేరు రంగారావు చొరవతో ఈ ప్రాంతానికి కళాశాల రావడం ఒక వరంగా భావించారు ప్రజలు. అప్పటి పరిస్థితుల్లో తాత్కాలికంగా మండల పరిషత్ సమీపాన ఉన్న ఎన్ఎస్‌పి కోటర్స్‌లో 15 సంవత్సరాల పాటు కళాశాల విద్యార్థులతో కళకళలాడుతూ, కొనసాగింది. నూతన భవనాల పేరుతో పెద్దకొమెర గ్రామం పరిధికి బదలాయింపు జరిగినప్పటినుండి ఆ కళాశాల కళ తప్పింది. కళాశాలకు విద్యార్థులు రావాలంటే ఎటు చూసినా 10 నుండి 25 కిలోమీటర్లు దూరం ఉంది. అందులో బస్సు సౌకర్యం లేకపోవడం ప్రధాన కారణం. అంతేకాదు హాస్టల్స్ సౌకర్యం అత్యంత అవసరం. ఇవి రెండు లోపించడంతో ఆ కళాశాలకు విద్యార్థులు రావాలంటే ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసిలతో పాటు మరో ఒకేషనల్ కోర్సు నడుపుతున్న ఈ కళాశాలలో 200 మంది చదవాల్సి ఉండగా కేవలం 30 మందితో కొనసాగడం ఆశ్చర్యం. ఇన్ని సౌకర్యాలు ఉన్న ఆ కళాశాలకు విద్యార్థులు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదా.? కళాశాల అధ్యాపకుల వైఫల్యమా..?, ప్రైవేటు కళాశాల యాజమాన్యాల ఒత్తిడి పెరిగిందా.? అన్న కోణంలో ప్రభుత్వం ఆలోచన చేయాలి.

కళాశాల కొనసాగాలంటే ప్రతినెల 7 నుండి 8 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. అంటే సంవత్సరానికి దాదాపు కోటి రూపాయలు ఖర్చు జరుగుతుంటే.? అక్కడ విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న వారు ఎంతమంది.? అన్న విషయం కూడా ప్రభుత్వం లెక్కలు వేయాలి. ఇంకో అడుగు ముందుకు వేస్తే ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. కానీ ఇవన్నీ పర్యవేక్షించాల్సిన అధికారులు తూతూ మంత్రంగా అప్పుడప్పుడు వచ్చి సంతకాలికే పరిమితమవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు కళాశాలను సందర్శించి, పరిశీలిస్తే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

సౌకర్యాలకై ఎంఎల్ఎకు వినతి ఇచ్చాం
- ప్రిన్సిపల్ జి.అనురాధ

కళాశాలకు విద్యార్థులు హాస్టల్ సౌకర్యం లేనందున వచ్చేందుకు సుముఖత చూపడం లేదని, బాలికలకు ప్రత్యేకంగా హాస్టల్ వసతి కల్పించాలని తిరువూరు ఎంఎల్ఎ కె.శ్రీనివాసరావును మా ఉపాధ్యాయులతో కలిసి వెళ్లి కోరాము. తమ పక్కనే ఎంతో ఖర్చుతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ కొలువు తీరింది. ఇందులో విద్యార్థులు 400కు సరిపడా వసతి సౌకర్యం ఉంది. కానీ ఇక్కడ కొద్ది మంది మాత్రమే పదో తరగతి లోపల విద్యార్థులు ఉంటున్నారు.

కుంభగిరి చరణ్ కుమార్ : నెమలి గ్రామం

మా ఊరికి, ప్రభుత్వ కళాశాల సమయానికి బస్సు సౌకర్యం లేదు. 25 కిలోమీటర్లు దూరం నుంచి రావాలంటే బోలెడంత ఖర్చుతోపాటు, సమయం పడుతుంది. ఒక్కో రోజు రాలేకపోతున్నాను.

ప్రభుత్వ వసతి కల్పిస్తే ఇక్కడ చదువుతాం
మేరుగు దివ్య : మేడూరు గ్రామం

మా కాలేజీలో లెక్చరర్స్ చదువు మంచిగా చెబుతున్నారు. మా కాలేజీలో విద్యార్థినులు (గర్ల్స్) 10 మంది వరకు నా ఫ్రెండ్స్ ఉన్నారు. మేమంతా ఒకే దగ్గర ఉన్నట్లయితే గ్రూపుగా చదువుకునే అవకాశం ఉంటుంది.

సంపెట నాగచైతన్య, ఎంపీసీ ఫస్టియర్ : చింతలనర్వ గ్రామం

కష్టమైనా మా ఊరు చింతలనర్వ నుండి వస్తున్నాను. కానీ వర్షాకాలం ఇబ్బందే.. బస్సు సౌకర్యం లేదు. ప్రభుత్వం గృహవసతి కల్పిస్తే ఇక్కడే ఉండి చదువుకుంటా.

గంధం అఖిల్, ఫస్ట్ హెచ్‌సి, వినగడప

మా గ్రామమైన వినకడప నుండి కళాశాల ఐదు కిలోమీటర్లె ఉం టుంది. నేను సైకిల్ పై వస్తున్న. మధ్యలో కట్టలేరు గత కొన్ని నీళ్లుగా కొద్దిపాటి వర్షానికి వరద పొంగి, రోజుల తరబడి కళాశాలకు రాలేకపోతున్నాను.

దూరం వెళ్లలేకపోతున్నాం : పదిలం
సతీష్ కుమారి, భగవాన్లపురం

మా అన్నయ్య, నేను ఈ కళాశాలలోనే చదువుకుంటున్నాం, మా ఊరు తునికిపాడు శివారు భగవాన్లపురం. 25 కిలోమీటర్ల దూరం వచ్చి పోవాలంటే చాలా ఖర్చు అవుతుంది.

కొంగల సుధీర్ : సిఇసి ఫస్టియర్

తిరువూరు మండలం గానుగపాడు గ్రామం నుండి వస్తున్నాను. మా ఊరికి తిరువూరు పోదామంటే దూరమైనందున సైకిల్ పై గంపలగూడెం కళాశాలకు వస్తున్న. ఇక్కడున్న హాస్టల్‌లో ఉంటానని అడిగితే కుదరదు అంటున్నారు.

ప్రమాదాల రహదారి

- రామవరప్పాడు నుంచి జంక్షన్ మార్గంలో ఏదో ఒక చోట ప్రమాదం
- రెండు నెలల్లో వందకు పైగా ప్రమాదాలు ● పది మంది మృతువాత

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గ పరిధిలో రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. రహదారి నిత్తురోడుతోంది. రహదారిపై గోతులు పడడంతో నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం జరుగుతోంది. కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఆసుపత్రికి వెళ్లే వారి సంఖ్య చెప్పలేం. రామవరప్పాడు నుండి హనుమాన్ జంక్షన్ వరకు జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయం అయింది. ఎయిర్ పోర్ట్ కు వీఐపీలతో భారీగా ట్రాఫిక్ పెరిగింది. గత రెండు నెలల్లో 100కి పైగా రోడ్ ప్రమాదాలు జరిగాయని చెబుతున్నారు. పదిమంది మత్యువాత పడ్డారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా ప్రమాదానికి గల కారణాలను పోలీసులు గుర్తించడం లేదని విమర్శ ఉంది. అర్ధరాత్రి సమయాల్లో యాక్సిడెంట్ లు చేసి వాహనదారులు పారిపోతున్నారు. వాటిని గుర్తించడానికి కనీసం జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు కూడా లేని పరిస్థితి. అరకొర ఉన్నా సరిగా పనిచేయని దుస్థితి ఉంది. వారంలో ఎక్కువసార్లు సీఎం చంద్రబాబు, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి లాంటి వీవీఐపిలు ఎయిర్ పోర్ట్ కి వస్తున్నారు. వీవీఐపిలు తిరిగే రోడ్లు పై కనీసం సీసీ కెమెరాలు లేకపోతే వారి భద్రతకు బాధ్యత ఎవరిదని తెలియడం లేదు. సామాన్యులు ప్రమాదం బారినపడితే ఏమైందో తెలుసుకోలేక నానా అగచాట్లు పడుతున్నారు. రామవరప్పాడు, నిడమానూరు క్రాస్ రోడ్, గూడవల్లి, కేసరపల్లి జంక్షన్, గన్నవరం కొత్తపేట, గాంధీ బొమ్మ సెంటర్, వెంకటేశ్వర థియేటర్ సెంటర్, చిన్న ఆవుటపల్లి, హనుమాన్ జంక్షన్ సెంటర్ ఏరియాలో ప్రమాదాలకు కేంద్రాలుగా మారాయని చెప్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రామవరప్పాడు నుండి హనుమాన్ జంక్షన్ వరకు జాతీయ రహదారి పై సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

దుకాణాన్ని ప్రారంభించిన తహసీల్దార్

రాయితీ దుకాణం ప్రారంభం

ప్రజాశక్తి-ఘంటసాల : ప్రభుత్వ ఆదేశాల మేరకు తక్కువ ధరలకే బియ్యం, కందిపప్పును దుకాణాల ద్వారా అందిస్తున్నట్లు తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఘంటసాలలో సరసమైన ధరలకే బియ్యం, కందిపప్పు ఇచ్చే దుకాణాన్ని ఆమె ప్రారంభించారు. బియ్యం (స్టీమ్డ్) రూ.49లు, బియ్యం (బిపిటి) రూ.48లు, కందిపప్పు రూ.160లకు దుకాణంలో విక్రయాలు చేపడతారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమస్య ఏదైనా ధైర్యంగా ఫిర్యాదు చేయండి : ఎస్‌పి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : సమస్యలతో వచ్చిన బాధితుల నుండి ఫిర్యాదులు స్వీకరించే క్రమంలో మనం చిరునవ్వుతో ఆ ఫిర్యాదును స్వీకరించి, మనస్ఫూర్తిగా వారి సమస్యను గూర్చి మాట్లాడితే అక్కడే వారి సమస్యలు సగం పరిష్కారం అయినట్లుగా ప్రజలు భావిస్తారని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఎస్పీ పిర్యాదు దారుల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యను విని సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామనే నమ్మకాన్ని వారిలో కలిగించాలన్నారు. సమస్యలపై ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఫిర్యాదుదా రులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి సమస్యను తెలుసుకొని సమస్యకు చట్ట పరిధిలో విచారణ జరిపి పరిష్కారం అందిస్తామని, సమస్య ఏదైనా ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీజి వెంకటేశ్వరరావు , మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి నాగరాజు ఫిర్యాదుల స్వీకరించారు. మీకోసం కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి 35 ఫిర్యాదులు వచ్చాయని ఎస్పీ కార్యాలయ అధికారులు తెలిపారు.

సమస్యలు వింటున్న ఎస్‌పి గంగాధర్‌రావు

విద్యతో ఉన్నతశిఖరాలను చేరొచ్చు

నగదు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉంగుటూరు : విద్య ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చునీ గురుకుల పాఠశాల , జూనియర్ కళాశాల (ఎపి ఆర్ జెసి) ప్రిన్సిపాల్ మున్నంగి ఇమ్మానియోలు అన్నారు. సోమవారం ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 2023 - 2024 విద్యాసంవత్సరంలో 10వ తరగతిలో అత్యదిక మార్కులు సాధించిన విద్యార్థిని గోగులమూడి అన్విత (470/600) కు ఉంగుటూరు సర్పంచ్ కాటూరి వరప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయ ని సిహెచ్ అనిత లతో కలిసి రూ 5 వేల రూపాయలు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఇమ్మానియోలు మాట్లాడుతూ తన తండ్రి మున్నంగి ఏసోబు జ్ఞాపకార్థం వారి వర్ధంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకునే ఎస్ సి, ఎస్ టి,బి సి (సి) కేటగిరీలో అత్యదిక మార్కులు సాధించిన విద్యార్థినికి గత దశాబ్ద కాలంగా ప్రతి సంవత్సరం 5వేల నగదు బహుమతి అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఉపాధి బకాయిలు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ మండలం అవురిపూడి గ్రామంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సచివాలయ కార్యదర్శి శిరీష కు ఉపాధి హామీ కార్మికులు పలు సమస్యలతో అర్జీని సోమవారం సమర్పించారు.ఉపాధి హామీ కార్మికులు పనిచేసిన 8 వారాల పనికి రావాల్సిన వేతనాలు ఇప్పటివరకు ఒక రూపాయి కూడా రాలేదని, బకాయిలు వెంటనే ఇవ్వాలని కోరారు.అలాగే కనీస వేతనం 600 రూపాయలు ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి 200 పని దినాలు కల్పించాలని, ఉపాధి హామీ పథకానికి వ్యవసాయాన్ని అనుసంధానం చేయరాదని, చేసిన పనిదినానికి పే స్లిప్పులు ఇవ్వాలని తదితర డిమాండ్లతో వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో ఏపీ కౌ లు రైతు సంగం కష్ణాజిల్లా కార్యదర్శి శీలం నారాయణ, ఉపాధి హామీ కార్మికులు మేడిశెట్టి పాండు రంగారావు, జొన్నలగడ్డ భాస్కరరావు, ఏనుగు కుమారి, మేడిశెట్టి మోహన్ రావు పాల్గొన్నారు.

నీట మునిగిన పొలాల పరిశీలన

ప్రజాశక్తి-ఉయ్యూరు : చినఓగిరాల, వీరవల్లి మొఖాసా గ్రామాల పరిధిలో నీటమునిగిన వరినాట్లు, నారు మడులను వ్యవసాయ అధికారులు సోమవారం పరిశీలించారు. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు చినఓగిరాల, వీరవల్లి మొఖాసలో పర్యటించి వరినాట్లు వేసిన పొలాలు, వరినారుమడులను ఉయ్యూరు చెరకు పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త సుధారా ణి, డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ టీమ్ పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వివిధ దశల్లో ఉన్న వరి నారు ముంపుకు గురవుతుందన్నారు. పొలంలో నీరు నిల్వకుండా రైతులు జాగ్రత్త లుతీసుకోవాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కె. శ్రీనివాసరావు, ఏఓ పద్మజ, మండల వ్యవసాయ అధికారి ఎస్.గణేశ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వీరవల్లి మొఖాసాలో నీట మునిగిన వరి పొలాలు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కెవిఆర్ కృషితో క్రీడా మైదానం అభివృద్ధి

- రెండు నెలల్లోనే రూ.5.80 లక్షల పనులు

ప్రజాశక్తి-గన్నవరం : తాను సంపాదించిన దాంట్లో కొంత సమాజ సేవకు కేటాయించాలనే ఆశయంతో పనిచేస్తున్న వ్యక్తి వాకర్స్ అధ్యక్షులు కె.వి.ఆర్ కిషోర్. తాను బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లో రూ. 5.80 లక్షలతో క్రీడా మైదానంలో అభివృద్ధి పనులు చేపట్టారు. వాకర్సు సభ్యులు రూ. 1.20 లక్షలు సహాయంగా అందించారు. మిగిలిన సొమ్మంతా కిషోర్ సొంత నిధులు ఖర్చు చేశారు. తాము చేసే పని శాశ్వతంగా ఉండాలనీ, పదిమందికీ ఉపయో గపడాలని ఆయన ఉద్దేశం.

ఈ ఆలోచనతో వాకర్ అసోసియేషన్ సభ్యుల సహకారంతో ముందుకు సాగుతూ అభివద్ధి పనులు వేగిరం చేస్తున్నారు. గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని లక్షల రూపాయల వ్యయంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలనే ఆశయంతో అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. వాకర్ సభ్యులందరినీ సమ న్వయం చేసి అభివృద్ధి పనులకు సహకారం అందిం చాలని పిలుపునిచ్చారు. దింతో వాకర్లు అందరూ, దాతలు తలో చెయ్యి వేసి ఆర్థికంగా నిధులు సమ కూర్చుకుని క్రీడామైదానంలో కొత్త అభివద్ధి పనులు చేస్తున్నారు. వాకర్ అసోసియేషన్ అధ్యక్షులుగా బాధ్య తలు చేపట్టిన కిషోర్ నేతత్వంలో పెద్దలు టిఎస్ఆర్‌టి ప్రసాద్, ముక్కామల సుబ్బారావు, తిరువీధి వెంకయ్య, కెఎన్ బాబురావు సలహాలు, సంప్రదింపులతో క్రీడామై దానంలో అనేక అనేక బహత్తర కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

క్రీడా మైదానంలో ఓపెన్ జిమ్ చూస్తే : ఈ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ఆధునిక సదుపాయాలతో నిర్మాణం చేయించారు. మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు బాలసౌరి జిమ్ పరికరాలను శాంక్షన్ చేయగా, వాటి నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తం కెవిఆర్ కిషోర్ నేతత్వంలో ఇచ్చారు. వాకర్ సభ్యులు దాతల సహకారం కూడా ఉంది. అదేవిధంగా వాకర్స్ సభ్యుల సహకారంతో ఇప్పటికే సుమారు అర కిలోమీటర్ పొడవు, 15 అడుగులు వెడల్పుతో వాకింగ్ ట్రాక్ నిర్మాణం జరిగింది. వాకింగ్ ట్రాక్ చుట్టూ మొక్కలు నాటడం, మొక్కలకు డ్రిప్ సిస్టం ద్వారా నీరు సరఫరా చేయటం జరిగింది. వాకింగ్ ట్రాక్ చుట్టూ విద్యుత్తు లైన్ ఏర్పాటుతో లైటింగ్ నిర్మాణం చేశారు. వాకింగ్ ట్రాక్ చుట్టూ మట్టి కొట్టుకొని పోకుండా ట్రాకుకు రెండు వైపులా రాళ్లతో ఫెన్సింగ్ నిర్మాణం, పోలీస్ సెలక్షన్స్ కు వెళ్లే విద్యార్థులకు మరియు క్రీడాకారులకు వారి అభ్యర్థన మేర దాతల సహకారంతో లాంగ్ జంప్ కోర్టు ఏర్పాటు చేసారు. వాకర్ సభ్యుల అభ్యర్థనమేరా డయాబెటిక్ పేషెంట్స్ కొరకు" 8" ఆకారంలో కోర్టు ఏర్పాటు చేసారు.గ్రౌండ్లో కాంపౌండ్ వాల్ లేని చోట దాతల సహకారంతో వైర్ ఫెన్సింగ్ ను ఏర్పాటు చేశారు. వ్యాయామం చేసి అలసి కాసేపు సేద తీరేందుకు సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు.

ఓపెన్ జిమ్

ఎవరో వస్తారని ఎదురు చూడకూడదు : కిషోర్

ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని ఎదురు చూడకుండా.. మనకున్న దానిలో కొంత సహాయం చేసి దాతల నుంచి మరికొంత సమీకరించుకొని అభివద్ధి చేసి చూపించాలి. క్రీడా మైదానానికి రోజుకి 400 మంది వాకింగ్ చేయడానికి వస్తుంటారు. ఆటలు ఆడేందుకు మరో వంద మంది వస్తారు. వీరి సౌకర్యార్థం అభివృద్ధి పనులు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. అభివద్ధి లక్ష్యంగా పనిచేస్తాం. కలిసొచ్చే వారితో ముందుకు నడుస్తాం. ఎలాంటి స్వప్రయోజనం ఆలోచించకుండా మంచి పనులు చేయాలని సదుద్దేశంతో మాపయనం సాగుతోంది.

విఎంసిలో 14 అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 14 అర్జీలు స్వీకరించినట్లు విఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ డాక్టర్ ఎ.మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత సంబంధిత శాఖాధిపతులు ఆ సమస్యకు ఖచ్చితమైన పరిష్కారాలు ఇచ్చేటట్టుగా చూడాలని, వచ్చిన ఫిర్యాదు పునరావృతం కాకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. విజయవాడ నగరపాలక సంస్థ ఇన్చార్జి కమిషనర్ డాక్టర్ ఎ.మహేష్ తన పర్యటనలో భాగంగా సోమవారం కటి రోడ్డు, మిల్క్ ప్రాజెక్ట్, లంబాడీపేట, సితార జంక్షన్ నుండి గొల్లపూడి రోడ్డు వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సైడ్ డ్రైన్‌లలో ఉన్న మంచినీటి పైపులను పరిశీలించారు. ఈ నెల 30 కల్లా ఎట్టి పరిస్థితుల్లో సైడ్ డ్రైన్లలో మంచినీటి పైపులైన్లు ఉండకూడదని, లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశాలిచ్చారు. నెలాఖరికల్లా డ్రైన్లలో పూడికలు పూర్తి చేయాలన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : స్థానిక నిమ్రా ఫార్మసీ కళా శాలలో సోమవారం పోటీ పరీక్షల్లో ఎలా విజయం సాధించాలి అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వ్యాఖ్యాతగా ప్రముఖ ఎస్ఎస్ కన్సల్టెన్సీ, ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ప్రతినిధి ఎవిఎస్ శేఖర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ప్రణాళిక ప్రకారం చదువుతూ, తక్కువ సమయంలో ఎక్కువ ఫలితాలు వచ్చేలా, షార్ట్‌కట్ మెథడ్స్‌ను అవలంబిస్తూ అభ్యాసం చేయడం ద్వారా పోటీ పరీక్షలలో సునాయాసంగా విజయం సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జనార్దన్, ప్రొఫెసర్ రవికుమార్, విద్యులతా, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తి పంటల పరిశీలన

ప్రజాశక్తి - వత్సవాయి : మండల కేంద్రమైన వత్సవాయిలో పత్తి పంటలను పత్తి పంటలనువ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. జగ్గయ్యపేట వ్యవసాయ సంచాలకులు భవాని, మండల వ్యవసాయ శాఖ అధికారి రవికుమార్, పత్తి పంటలను పరిశీలించారు. రైతులకు పళ్ళు సూచన చేశారు. ముందుగా పొలంలో నుంచి ఉన్న నీటిని బయటికి తీయాలని తెలకపాటి నేలలో 25 కేజీలు యూరియా, 25 కేజీల పొటాషియం సల్లాలని సూచించారు.

వర్షానికి కూలిన ఇల్లు - తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రెడ్డిగూడెంలోని స్థానిక బిసి కాలనీలో చంద్రగిరి మారేసు ఇల్లు కూలింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలిసిన స్థానిక టిడిపి నాయకులు, నిత్యావసర సరుకులను అందజేశారు. బాధితులకు టిడిపి మండల మాజీ తెలుగు యువత అధ్యక్షులు ఉయ్యూరు వెంకటేశ్వరరెడ్డి (పెద్దోడు), ఉయ్యూరు సుబ్బారెడ్డి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.

సాయం చేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

ఆశా కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఎ.కొండూరు : ఎ.కొండూరు గ్రామానికి చెందిన ఆషా కార్యకర్త తోట రాధమ్మ ఇటీవల అకస్మాత్తుగా మరణించడంతో ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది, ఎఎన్ఎంలు, ఎంఎల్ హెచ్‌పిలు అందరూ కలిసి సోమవారం పెద్దకర్మ సందర్భంగా రూ.30వేల ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.దివ్య, ఇన్చార్జ్ వైద్యాధికారి డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. రాధమ్మ చనిపోయిన రోజున మట్టి ఖర్చుల నిమిత్తం రూ: 15,వేల రూపాయలు అందజేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

సాయం అందజేస్తున్న దృశ్యం

క్వారీ కార్మికులకు భద్రత, కనీస వేతనాలు అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : క్వారీ ప్రమాద నివారణకు తనిఖీలు చేపట్టాలని, వారి కార్మికులకు భద్రత కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ సోమవారం ఇబ్రహీంపట్నం మండల తహశీల్దార్‌కు సిఐటియు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండల పరిధిలో వందలాది క్వారీలు అనుమతులతోనూ, అనుమతులు లేకుండా కూడా నడుస్తున్నాయి. వీటిలో కార్మికులకు భద్రత కరువై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని క్వారీల నిర్వహణపై తనిఖీలు, ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపి కార్మికులకు భద్రత కల్పించాలి. కనీస వేతనాలు అమలు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ లాంటి చట్టబద్ధత మైన సౌకర్యాలు కల్పించాలని, క్వారీ కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలని, లేబర్ అధికారుల ద్వారా నమోదు చేసి కార్మికులందరికీ లేబర్ కార్డ్స్ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఏ.విఠల్‌రావు, ఎస్‌కె బాషా, కె.నారాయణ, పాటల శ్రీను, జూపూడి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

2011 రైతుల చట్టాన్ని అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి - తిరువూరు : వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన కౌలు రైతుల చట్టాన్ని రద్దుచేసి 2011 రైతుల చట్టాన్ని అమలుచేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో తిరువూరు తహశీల్దార్ ప్రకాశ్ బాబుకు సోమవారం రైతులు వినతిపత్రం అందజేశారు. భూ ఆధీకృత రైతుల చట్టాన్ని అమలుచేసి గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించాలని, భూ యాజమానుల సంతకంతో సంబంధం లేకుండా గ్రామ రెవెన్యూ అధికారులే కౌలు రైతులను గుర్తించి కౌలు కార్డులివ్వాలని, పంట నమోదు, ఈ క్రాప్ బుకింగ్ కౌలు రైతుల పేరుతోనే నమోదు చేయాలని కోరారు. పంట రుణాలు, పంటల బీమా, పంట నష్టపరిహారాలు, రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాలు కౌలు రైతులకే అందేలా చర్యలు తీసుకోవాలని, కులాలతో సంబంధం లేకుండా భూమిలేని ఓసి కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని రైతులు వినతిపత్రంలో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు, నాయకులు ఎస్వీ. భద్రం, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు వేముల హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గ్రీవెన్స్‌లో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - నందిగామ : నంది గామ పట్టణంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాల యంలో పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా సోమవారం అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 6 అర్జీలు వచ్చినట్లు నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారి ఏ.రవీంద్ర రావు తెలిపారు. అర్జీలను సంబంధిత ఆధికారులకు సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్ - 2, మున్సిపల్ డిపార్ట్‌మెంట్ -2, పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్ -1, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ -1 అర్జీలు వచ్చాయని తెలిపారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండల పరిధిలోని మద్దులపర్వ ఆదర్శ పాఠశాలలో స్టూడెంట్ కిట్లను టిడిపి నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నాగేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తకు మాతృవియోగం

ప్రజాశక్తి-ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు వైసిపి గ్రామ అధ్యక్షుడు బెజవాడ నాగకృష్ణ మాతృమూర్తి బెజవాడ మహాలక్ష్మి (65) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. మృతదేహాన్ని తిరువూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్ సందర్శించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కుటుంబాన్ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భూక్యా గనియా, సర్పంచ్ మోర్ల లక్ష్మీ సాంబశివరావు నివాళులర్పించారు.

వెబ్ డెవలప్మెంట్‌పై అవగాహన

ప్రజాశక్తి - మైలవరం : ఆధునిక డిజిటల్ యుగంలో వెబ్ డెవలప్‌మెంట్ అనేది అత్యంత ముఖ్యమైన నైపుణ్యాల్లో ఒకటని ఇన్ఫోసిస్ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ బావ రాజు సాయి శశాంక్ పేర్కొన్నారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం సిఎస్ఐ ఎల్విఆర్ సిఇ స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించే డెవలప్మెంట్ బేసిన్ బూట్ క్యాంపు అనే అంశంపై ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వారం రోజుల పాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బావ రాజు సాయి శశాంక్ మాట్లాడుతూ అభ్యాసకులను ప్రొఫెషనల్ స్థాయికి తీసుకెళ్లే క్రమంలో సమర్థవంతంగా నేర్పించడంలో బాగా ప్రాచుర్యం పొందాయన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్ రెడ్డి మాట్లాడుతూ యూజర్ ఇంటర్ఫేస్ యూజర్ అనుభవం అభివృద్ధి అప్లికేషన్ ఫ్రేమ్ వర్క్ వారికి ఉద్యోగ అవకాశాలు, ప్రొఫెషనల్ ఎదుగుదల కోసం ఒక బలమైన పునాది ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

OFFICE OF THE RECOVERY OFFICER - II
DEBTS RECOVERY TRIBUNAL
(Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Sai Baba Street, Narayan Bhawanam, Dabagardens, Visakhapatnam -530020

FORM - 17
(See rule 53 of the Second Schedule to the Income-tax Act, 1961)
NOTICE FOR SETTLING A SALE PROCLAMATION
R.P. No. 280 of 2023 in OA No. 502 of 2020
Union Bank of India (e-Andhra Bank), Main Branch, Eluru Road, Gudivada, Krishna District
Versus
Mrs. Koneru Sree Rajyalakshmi Vijaya Chamundeswari Devi
To
(CD-1) Mrs. Koneru Sree Rajyalakshmi Vijaya Chamundeswari Devi, W/o. Sri Koneru Leela Prasad, represented by her General Power of Attorney holder Mr. Kodali Nageswara Rao, Gudivada, Krishna District.

Whereas in execution of Recovery Certificate dated 22-05-2023 in **O.A.No. 502 of 2020 for Rs. 1,53,75,909/-** with future interest @ 10.20% p.a. with quarterly rests from 14-09-2020 till realization forwarded by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam, the undersigned has ordered the sale of the under mentioned immovable properties.

You, the Certificate Debtors/Defendants above named, are hereby informed that on or after fifteenth day from the date of service of this notice has been fixed for drawing up the proclamation of sale and settling the terms thereof. You are requested to bring to the notice of the undersigned any encumbrances, charges, claims or liabilities attaching to the said properties or any portion thereof.

SPECIFICATION OF PROPERTY
SCHEDULE - B : Item No. 1 : Property covered under registered title deed No. 819/1998 dated 25-03-1998 of SRO, Gudivada, Krishna District.
All that the part and parcel of the property in Krishna District, Gudiwada sub registry, Gudiwada municipality limits and Gudiwada village 16th ward the property covered under RS No. 191/3 out of an extent of Ac 1.81 cents at the nearest house bearing door no. 16-366-A-1, vacant residential site an extent measuring 455 sq.yards or 380.42 sq.meters situated within the following **boundaries : East :** Property of Prem Kiran and others sold to K. Venkateswara Rao - 105'0"; **West :** Property of Vendees - 105'0"; **South :** Property of K V Rani - 39'0"; **North :** Gudiwada to Pamarru road Margin - 39'0"
Item No.2 : Property covered under registered title deed No. 477/ 1998 dated 06-12-1997 of SRO, Gudivada, Krishna District.
All that the part and parcel of the property in Krishna District, Gudiwada sub registry, Gudiwada municipality limits and Gudiwada village 16th ward the property covered under RS No. 191/3 out of an extent of Ac 1.83 cents at the nearest house bearing door no. 16-366 with assessment no. 2099 vacant residential site an extent measuring 315 sq.yards or 263.37 sq.meters situated within the following **boundaries : East :** Property of Naga Vara Prasada Rao - 105'0"; **West :** Property of P Durga Rao and others - 105'0"; **South :** Property of K Vindhya Rani - 27'0"; **North :** Bandar to Tiruvur road Margin - 27'0"
(Given under my hand and seal of this Tribunal at Visakhapatnam on the 21th May, 2024)
(B.N.S.V.S.K. BANGARRAJU)
Recovery Officer-II
Debts Recovery Tribunal, Visakhapatnam

OFFICE OF THE RECOVERY OFFICER - II
DEBTS RECOVERY TRIBUNAL
(Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Sai Baba Street, Narayan Bhawanam, Dabagardens, Visakhapatnam -530020

FORM - 17
(See rule 53 of the Second Schedule to the Income-tax Act, 1961)
NOTICE FOR SETTLING A SALE PROCLAMATION
R.P. No. 30 of 2020 in OA No. 596 of 2019
Union Bank of India (e-Andhra Bank), Main Branch, Eluru Road, Gudivada, Krishna District
Versus
Mrs. Kommuri Vijayalakshmi
To
(CDR-1) Mrs. Kommuri Vijayalakshmi, W/o. Sri Kommuri Mohana Rao, Door No. 54-20/3-5, Plot No. 42, Gurunanak Nagar, Vijayawada, Krishna District - 521322

Whereas in execution of Recovery Certificate dated 23-10-2020 in **O.A.No. 596 of 2019 for Rs. 54,75,930/-** with future interest @ 10.20% p.a. with quarterly rests from 21-06-2019 till realization forwarded by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam, the undersigned has ordered the sale of the under mentioned immovable properties.

You, the Certificate Debtors/Defendants above named, are hereby informed that on or after fifteenth day from the date of service of this notice has been fixed for drawing up the proclamation of sale and settling the terms thereof. You are requested to bring to the notice of the undersigned any encumbrances, charges, claims or liabilities attaching to the said properties or any portion thereof.

SPECIFICATION OF PROPERTY
SCHEDULE - B : Item No. 1 : Property covered under registered title deed No. 628/1995 dated 22-11-1994 of SRO, Madhira, Khammam District.
All that part and parcel of the property in Khammam district, Madhira sub registry, Yerrupalem Mandal, Mamunuru village and gram panchayat covered under Survey No. 398/A property measuring an extent of Ac 3.70 cents of Ha 1.497 dry agriculture land situated within the following **boundaries : East :** Road; **South :** Property bought by vendees from KVNR Kumar; **West :** MLN Prasad & others; **North :** ADN Prasad & others.
Item No.2 : Property covered under registered title deed No. 629/ 1995 dated 22-11-1994 of SRO, Madhira, Khammam District.
All that part and parcel of the property in Khammam district, Madhira sub registry, Yerrupalem Mandal, Mamunuru village and gram panchayat covered under survey no. 398/A property measuring an extent of Ac 3.70 cents of Ha 1.497 dry agriculture land situated within the following **boundaries : East :** Road; **South :** Property of YVN Sarma; **West :** MLN Prasad & others; **North :** KVN Hari Prasad.
(Given under my hand and seal of this Tribunal at Visakhapatnam on the 25th June, 2024)
(B.N.S.V.S.K. BANGARRAJU)
Recovery Officer-II
Debts Recovery Tribunal, Visakhapatnam

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : కలెక్టర్

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : ప్రజా సమస్యల పట్ల తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ సమావేశం మందిరం లో ప్రజా సమస్యల పరిష్కార వేదికు- "మీకోసం కార్యక్రమం" నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.జిల్లా కలెక్టర్ ప్రజల సమస్యలను ఎంతో ఓపిగ్గా విని సంబంధిత శాఖల అధికారులను పిలిపించి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు వివిధ ప్రాంతాల నుండి ఎన్నో వ్యయా ప్రయాసలకు ఓర్చుకొని తమ సమస్యలు విన్నవించుకునేందుకు వస్తుంటారని, వారి పట్ల తగినంత శ్రద్ధ వహించి వారి సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు.మొత్తం 112 అర్జీలు జిల్లా యంత్రాంగానికి అందాయి.

యోగా వలన ఎన్నో ప్రయోజనాలు : ఆరోగ్యమే మహాభాగ్యమని అంటూ జిల్లా కలెక్టర్ ప్రతి ఒక్క ఉద్యోగి ఉచిత యోగ తరగతులలో పాల్గొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈనెల 23వ తేదీ మంగళవారం నుండి ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు మచిలీపట్నం లోని జడ్పీ కన్వెన్షన్ హాలులో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ తరగతుల్లో ప్రతి ఒక్క ఉద్యోగి పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, ఆర్డీవో ఎం వాణి, ఐ సి డి ఎస్ పి డి సువర్ణ, పార్వతి హెచ్ ఓ డి ఎం హెచ్ ఓ డాక్టర్ గీతగోవిందం, సి కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, డ్రామా పీడీ యువసేన జివి సూర్యనారాయణ, డిపిఓ నాగేశ్వర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి మచిలీపట్నం వచ్చిన కొలుసు పార్థసారథిని మచిలీపట్నం ప్రెస్ క్లబ్ తరపున ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిథులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్అండ్‌బీ అతిథి గహంలో మంత్రిని కలిసిన జర్నలిస్టులు తమ సమస్యలను వివరించారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, నివేశన స్థలాలు ఇవ్వాలని, హెల్త్ ఇన్సూరెన్స్ చేయించాలని మంత్రిని కోరారు. అలాగే ప్రైవేట్ విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన మాదిరి 100 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి తెలిపారు. జర్నలిస్టుల న్యాయపరమైన కోర్కెలను నెరవేర్చేందుకు కషిచేస్తానని మంత్రి కేపీ సారథి అన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-విజయవాడ : ఈనెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఐదు రోజులపాటు ప్రత్యేక ఆధార్ క్యాంపులు జరగనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు . ఈ శిబిరాల్లో అన్ని రకాల డాక్యుమెంట్ల అప్డేట్, బయోమెట్రిక్ అప్డేట్, మొబైల్ అప్డేట్, అడ్రస్ అప్డేట్ వంటి అన్ని సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆయా మండలం, మున్సిపాలిటీ పరిధిలో క్యాంపులు ఎక్కడ నిర్వహించేది ఇప్పటికే ఆయా ప్రదేశాలను ప్రజలు తెలియజేయడం జరిగిందని.. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి దగ్గరలోని ప్రత్యేక ఆధార్ శిబిరానికి వెళ్లి సేవలను వినియోగించుకోవాల్సిందిగా కోరుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎ. కొండూరు-2, జి. కొండూరు-2, గంపలగూడెం-2, ఇబ్రహీంపట్నం-3, జగ్గయ్యపేట అర్బన్ - 3, జగ్గయ్యపేట రూరల్ - 1, కొండపల్లి - 1, మైలవరం - 2, నందిగామ - 1, నందిగామ అర్బన్ - 1, పెనుగంచిప్రోలు - 2, రెడ్డిగూడెం - 1, తిరువూరు - 2, తిరువూరు అర్బన్ - 1, వత్సవాయి - 1, వీరులపాడు - 2, విజయవాడ రూరల్ - 4, విజయవాడ అర్బన్ - 25, విస్సన్నపేట - 1 కిట్లు పనిచేస్తాయన్నారు.

ప్రకాశం బ్యారేజికి కొనసాగుతున్న వరద

ప్రజాశక్తి-విజయవాడ : ఎగువ ప్రాంతం నుంచి ప్రకాశం బ్యారేజికి వరద నీరు వచ్చి చేరుతుంది. బ్యారేజికొచ్చే ఇన్‌ఫ్లో 8, 606 క్యూసెక్కులు కాగా, అదే స్థాయిలో బ్యారేజి అధికారులు దిగువకు, కెనాల్స్‌కు నీటిని తరలిస్తున్నారు. పాలేరు, కీసర, మున్నేరు, కట్టలేరు తదితర ఏరియాల నుంచి ప్రకాశం బ్యారేజికి 8,606 వరద నీరు వచ్చి చేరుతుండగా, దీనిలో 6,469 క్యూసెక్కుల నీటిని బ్యారేజికున్న 9 గేట్లను ఒక అడుగు ఎత్తేసి దిగువకు నీటిని పంపిస్తున్నారు. అలాగే 2,108 క్యూసెక్కుల నీటిని కెనాల్స్‌కు విడుదల చేస్తున్నారు. పోలవరం నుంచి, పులిచింతల ప్రాజెక్టుల నుంచి బ్యారేజికి వచ్చే నీరు నిలిచిపోయింది.

నష్టపరిహారాన్ని అంచనా వేయండి

మాట్లాడుతున్న తాసిల్దార్ రాంబాబు

ప్రజాశక్తి-పెడన : గత పది రోజులుగా కూర్చున్న అకాల వర్షాలు కారణంగా నష్టపోయిన ఇల్లు, వ్యవసాయ, కూరగాయల తోటలు లాంటి వాటిని సర్వే చేసి నివేదికను తయారు చేయాలని తాసిల్దార్ ఆర్ రాంబాబు ఆదేశాలు జారీ చేశారు. తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం విఆర్ఓ, వీఆర్ఏ, మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గత పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నష్టపోయిన వాటిని అంచనా రూపంలో నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం అడిగిన వెంటనే పూర్తి సమాచారాన్ని అందించే విధంగా ఉండాలని చెప్పారు. అంతేకాకుండా పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని వర్షాలు కారణంగా నష్టపోయిన లబ్ధిదారులు సచివాలయాల్లో అర్జీలు దాఖలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఆర్ఐ మణికుమార్, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

జెసి సంపత్ కుమార్ సేవలు అభినందనీయం

జెసిని సత్కరిస్తున్న కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-విజయవాడ : ఎన్‌టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా డా. పి.సంపత్ కుమార్ అందించిన సేవలు అద్వితీయమని.. ఆయన అత్యంత సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారని జిల్లా కలెక్టర్ డా. జి. సజన పేర్కొన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన సంపత్ కుమార్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో సోమవారం పింగళి వెంకయ్య సమావేశం మందిరంలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన్ను జిల్లా అధికారులు ఘనంగా సత్కరించారు. వివిధ శాఖల అధికారులు ఆయనతో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కలెక్టర్ సజన మాట్లాడుతూ నిబద్ధతతో, క్రమశిక్షణతో సంపత్ కుమార్ సేవలు అందించి.. తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివద్ధి కార్యక్రమాల అమల్లో ప్రతి అంశంలోనూ కిందిస్థాయి సిబ్బందికి సరైన మార్గనిర్దేశనం చేస్తూ, మంచి ఫలితాలు వచ్చేలా పనితీరు కనబరిచారన్నారు. ముఖంపై చిరునవ్వును చెదరనివ్వకుండా, విధి నిర్వహణ పరంగా రాజీపడకుండా సేవలందించారన్నారు. అనంతరం డిఆర్ఓ వి. శ్రీనివాసరావు, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, డిపిఓ ఎన్ వి శివప్రసాద్ యాదవ్ , హౌసింగ్ పీడీ రజిని కుమారి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.వి. రమణ, ఆర్ అండ్ బి ఎస్ఈ వి కే విజయ శ్రీ , డిస్ట్రిక్ట్ సివిల్ సప్లై ఆఫీసర్ జి మోహన్ బాబు, డిస్ట్రిక్ట్ యా నిమల్ హస్బెండరీ ఆఫీసర్ కె. విద్యాసాగర్, ఫిషరీస్ డిడి పెద్దిరాజు, డిస్ట్రిక్ట్ హార్టికల్చర్ ఆఫీసర్ పి. బాలాజీ కుమార్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జే.సునీత, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ , సమగ్ర శిక్ష జీ మహేశ్వర రావు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి ఉమాదేవి , ఏపీఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.ఎం సుభాని, గ్రౌండ్ వాటర్ డిప్యూటీ డైరెక్టర్ బి నాగరాజు లు జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు.

26, 27 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనం

ప్రజాశక్తి-గుంటూరు : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా ప్లీనరీ సమావేశాలు ఈనెల 26, 27 తేదీల్లో గుంటూరు నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ తెలిపారు ఈ మేరకు పోస్టర్లను స్థానిక బ్రాడీపేటలోని కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకునేందుకు సమావేశాల్లో చర్చించనున్నట్లు చెప్పారు. జిల్లాలో రాజధాని ప్రాంతంలో భూములు సేకరణ సమయంలో అక్కడ విద్యాసంస్థల్లో 10 శాతం సీట్లు రాజధాని ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తామనే హామీని అమలు చేయాలని, జీవో 77ను వెంటనే రద్దు చేయాలని కోరారు. జిల్లాలో హాస్టల్స్‌లో చేరే

విద్యార్థుల సంఖ్య వేలల్లో ఉంటున్నా సరిపడా హాస్టల్స్ లేవన్నారు. గుంటూరు నగరంలో హాస్టల్స్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. హాస్టల్ మెస్ చార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న మెస్ ఛార్జీలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్.కె.సమీర్, ఉపాధ్యక్షులు సుచరిత, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు యశ్వంత్, భగత్‌సింగ్, భరత్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఆయిల్ పామ్ తోటల సాగు రైతును ఆర్థికంగా నిలబెడుతుందని, తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను పొందగలిగే ఆయిల్ పామ్ సాగు పట్ల రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. సోమవారం పామర్రు ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై గ్రామస్థాయి ఉద్యాన, వ్యవసాయ శాఖల సహాయ సిబ్బందికి, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయిల్ పామ్ సాగు విధానం, సాగుకు ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ రాయితీల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ ఫాం సాగు చేపట్టే రైతులకు హెక్టారుకు 143 మొక్కలను వంద శాతం సబ్సిడీతో ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. సాధారణంగా ఒక్కొక్క మొక్క ధర రూ.193 ఉంటుందని, రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయి సబ్సిడీతో ఉచితంగా మొక్కలను అందిస్తుందన్నారు. అదేవిధంగా సూక్ష్మ సేద్యం పద్ధతిపై సాగు చేపట్టే రైతులకు 50 శాతం రాయితీతో డ్రిప్పర్స్, జెట్ పరికరాలను అందిస్తామని అన్నారు. పంట అయిదవ సంవత్సరం నుంచి చేతికి వస్తుందని, ఆ లోపుగా మొదటి నాలుగు సంవత్సరాల వరకు మొక్కలకు ఎరువుల యాజమాన్యం, అంతర పంటల సాగు నిమిత్తం సంవత్సరానికి ఒక హెక్టారుకు రూ.5,625 రైతులకు అందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ అశోక్ కుమార్, ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ పిడి విజయలక్ష్మి, పతాంజలి ఫుడ్స్, 3ఎఫ్ కంపెనీల ప్రతినిధులు చంద్రబాబు, శరత్, ఎంపీడీవో మద్దిపట్ల భారతి, తహసిల్దార్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో నీటి సమస్యల పరిష్కరించాలి

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక కాకర్ల వీధిలోని బాలుర ఎస్సీ, ఎస్టీ వసతి గృహంలో నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం సాయికుమార్ కోరారు. ఆదివారం బాలుర ఎస్సీ, ఎస్టీ వసతి గహాన్ని ఏఐఎస్ఎఫ్ గుడివాడ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్ మాట్లాడుతూ హాస్టల్లో ప్రధానంగా ఉన్నటువంటి సమస్య నీటి సమస్య విద్యార్థులు స్నానం చేయాలంటే మంచి నీరు కూడా లేనటువంటి దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ వసతి గృహంలోని బోరు రిపేర్ కావడంతో దాన్ని బాగు చేయించకుండా బయట నుంచి నీరును పైప్ లైన్ ద్వారా హాస్టల్స్‌కి కనెక్షన్ ఇవ్వడం వల్ల నీరు కలుషితమై హాస్టల్‌కి వస్తున్నాయన్నారు. దీనివల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. 12 మరుగుదొడ్లు ఉంటే ఒక్క దాంట్లో కూడా కుళాయి ద్వారా నీరు అందడం లేదన్నారు. విద్యార్థులు నిద్రించడానికి మంచాలు లేకపోవడంతో నేలపై నిద్రిస్తున్నారని, అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కష్ణాజిల్లా కన్వీనర్ సాదిక్, నాయకులు సన్నీ, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

హరిప్రసాద్‌కు అభినందనలు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : శాసనమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన పిడుగు హరిప్రసాద్ ను సోమవారం మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకష్ణ కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు,యూత్ అధ్యక్షులు కూనపురెడ్డి ప్రసాద్, జనసేన పార్టీ నాయకులు డివిజన్ ఇన్చార్జిలు కర్రి మహేశ్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** పిడుగు హరిప్రసాద్ ఎంఎల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పెనమలూరు నియోజకవవర్గ జనసేన సమన్వయకర్త ముప్పా రాజ, జనసేన నాయకులు పచ్చిపాలశేఖర్, వాకా ఓంకార్,బోయిన నాగరాజులు ఆయనకు అభినందనలు తెలిపారు.

వెండి రుద్రాక్షమాల బహూకరణ

ప్రజాశక్తి-చల్లపల్లి మండల పరిధిలోని పురిటిగడ్డలోని శ్రీకష్ణ సాయి ధ్యాన మందిరానికి భక్తులు సోమవారం వెండి రుద్రాక్షమాల సమర్పించారు. పురిటిగడ్డ గ్రామానికి చెందిన బెజవాడ ధర్మారావు కుమార్తెలు-అల్లుళ్ల అంకిశెట్టి శివ సుబ్రహ్మణ్యం- నాగలక్ష్మి, నంబూరి శివ నాగరాజు-కల్పన సాయిబాబా అలంకరణ కోసం రూ.లక్ష ఐదు వేలు విలువ గల వెండి రుద్రాక్ష మాలను సమర్పించారు. ఆలయంలో బాబావారికి ప్రత్యేక పూజలు జరిపించుకోగా అనంతరం దాతలను ఆలయ వ్యవస్థపకులు నాదెళ్ల శివరామకష్ణ సత్కరించారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ముగ్గురు వ్యక్తుల నుండి 2,300 గ్రాముల గంజాయిని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.. . ఇబ్రహీంపట్నం సిఐ ఎం.సత్యనారాయణకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ యు.పాపారావు వారి సిబ్బంది, మండలం ఎమ్మార్వో రాజు కలిసి కొండపల్లి గ్రామం శాంతినగర్ జన్మభూమి కాలనీ వద్దకు వెళ్లారు. అక్కడ ముగ్గురు వ్యక్తులు పోలీసుల రాకను గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఒడిస్సా ప్రాంతానికి చెందిన ముఖేష్ తప్పు, పర్బిన్ బిల్లుంగ్, సుభాష్ లక్రా కొండపల్లిలోని ఐడియా వద్ద వచ్చి జన్మభూమి కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. వారికీ గంజాయి తాగే అలవాటు ఉన్నందున వారి గ్రామానికి చెందిన అలోక్బాగ్ అనే వ్యక్తి వద్ద సుమారు 2,300 గ్రాములు గంజాయిని కొనుగోలు చేసి కొంత తాగి మిగిలినది పెద్ద మొత్తానికి అమ్మాలనుకున్నారు. అందుకోసం రోడ్డుపై నిలబడగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కంచికచర్ల : కొద్ది రోజులుగా నిరంత రంగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈవో పిఆర్ అండ్ ఆర్ డి బి. శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, కంచికచర్ల ఎంపీడీవో ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా గ్రామాలలో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని కోరారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో అవగాహన ర్యాలీలు, మానవహారాల ద్వారా ప్రజలను చైతన్య పరిచినట్లు శ్రీనివాసరావు తెలిపారు. పంచాయితీ సిబ్బంది తమ పరిధిలో ఇళ్ల మధ్య మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు. మురుగు నిలువ ఉన్నచోట బ్లీచింగ్ చల్లించారు. పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యా యులు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశావర్కర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి కాపునాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా సత్యనారాయణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కాపుల సంక్షేమం, అభివృద్ధికి అమరావతి కాపునాడు కట్టుబడి ఉందని అమరావతి కాపునాడు రాష్ట్ర గౌరవాధ్యక్షులు సంకర సత్యనారాయణ అన్నారు. సోమవారం గాంధీనగర్ స్థానిక ప్రెస్ క్లబ్‌లో అమరావతి కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు సుంకర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమరావతి కాపునాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా నరహరిశెట్టి సత్యనారాయణను నియమిస్తూ నియామక పత్రాన్ని అందచేశారు. అనంతరం సుంకర శ్రీనివాస్ మాట్లాడుతూ గత నలభై సంవత్సరాలుగా కాపు నాయకుడు వంగవీటి రంగా ఆశయాలకు అణుగుణంగా కాపుల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తుమన్నారు. ఈ కార్యక్రమంలో అమరావతి కాపునాడు రాష్ట్ర సెక్రటరీ జోన్నలగడ్డ రవీంద్ర నాథ్, జనరల్ సెక్రటరీ ఘంటా ఫణికుమార్, జనరల్ సెక్రటరీ వీర్ల జ్యోతిబసు, జనరల్ సెక్రటరీ చల్ల చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

సైన్స్ టీచర్స్ హ్యాండ్ బుక్ ఆవిష్కరణ

విజయవాడ : స్థానిక సివిఆర్ ఎంసి ఉన్నత పాఠశాలలో ఎన్టీఆర్ జిల్లా బయోలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం తరపున బయలాజికల్ టీచర్స్ హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించారు. జిల్లా డిఎస్ఇఒ యువి.సుబ్బారావు, సెంట్రల్ ఎంఇఒ-1 సాంబశివరావు, ఎంఇఒ-2 విజయ రామారావు, అధ్యక్ష ప్రధాన కార్యద ర్శులు డాక్టర్ మామిడి శ్రీనివాస్ రావు, నాగరామారావు, గౌరవ అధ్యక్షులు విటిఆర్ నెహ్రూ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.వి.సుబ్రమణ్యం ఆవిష్కరణలో పాల్గొ న్నారు. పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారని డాక్టర్ మామిడి శ్రీనివాసరావు తెలిపారు.

పేటలో కాసం ఫ్యాషన్స్ ప్రారంభం

హీరోయిన్ నభా నటేష్ రాకతో సందడి

అభిమానులకు అభివాదం చేస్తున్న నభా నటేష్

జ్యోతి ప్రజ్వలన చేస్తూ....

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేటలోని (బస్ డిపో పక్కన కోదాడ రోడ్) కాసం షాపింగ్ మాల్స్ గ్రూప్ వారి నూతన 12వ బ్రాంచ్ అతి పెద్ద వస్త్రాలయం సోమవారం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మొట్టమొదటి షోరూమ్ జగ్గయ్యపేటలో ప్రారంభమైంది. గతంలో హన్మకొండ, పరకాల, వికారాబాద్, షాద్‌నగర్, జమ్మికుంట, భద్రాచలం, మహబూబాబాద్, పాల్వంచ, సదాశివపేట, శంకర్ పల్లి, గద్వాల్‌లో ఏర్పాటుచేశారు. తాజాగా జగ్గయ్యపేటలో ప్రారంభించిన బ్రాంచితో కలిపి మొత్తం ఆ సంఖ్య 12కు చేరింది. ఫ్యాషన్ రంగంలో దాదాపు 78 ఏళ్ల చరిత్ర కలిగిన ఏకైక షాపింగ్ మాల్స్ నుండి తెలంగాణలో 11 షోరూమ్‌లను ప్రారంభించారు. జగ్గయ్యపేటలో అన్ని హంగులతో సిద్ధమైన ఈ బట్టల షోరూంను సోమవారం హీరోయిన్ నభా నటేష్ (ఇస్మార్ట్ శంకర్ సినిమా ఫేమ్) చేతుల మీదుగా ప్రారంభించారు. హీరోయిన్ రాకతో అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. కొద్దిసేపు వారితో ముచ్చటించిన ఆమె అనంతరం 'ఇస్మార్ట్ శంకర్' పాటకు డ్యాన్స్ చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా నభా నటేష్ మాట్లాడుతూ 'డబుల్ ఇస్మార్ట్', 'డార్లింగ్'తో పాటు మరికొన్ని సినిమాల్లో తాను నటిస్తున్నానన్నారు. తన సినిమాలను ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యఅతిథులుగా జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మాజీ శాసనసభ్యులు సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు, శ్రీరాం చినబాబు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు, స్థానికులు పాల్గొన్నారు. కాసం గ్రూప్ యాజమాన్యం తరపున కాసం మల్లికార్జున్, కాసం నమశ్శివాయ, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్ మాట్లాడుతూ కాసం షాపింగ్ మాల్స్‌లో చిన్న పిల్లల నుండి పెద్ద వాళ్ళ వరకు శారీస్, డ్రెస్సెస్, కిడ్స్ వేర్, మెన్స్ వేర్ ఇలా అన్ని ఒకే షోరూంలో అందరికి అందుబాటులో ఉండేలా ఏర్పాటుచేశామన్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి షాపింగ్ చేసుకునేలా ప్రతి స్టోర్‌లో మహిళలు, పురుషులు, చిన్నపిల్లలకు అందరికి లేటెస్ట్ కలెక్షన్స్ సరసమైన ధరలతో అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఖాతాదారులు నాణ్యమైన, నమ్మకమైన షాపింగ్ అనుభూతిని ఖచ్చితంగా పొందొచ్చన్నారు. మరిన్ని వివరాలకు కాసం ఫ్యాషన్స్ వెబ్‌సైట్‌ను సంప్రదించొచ్చని కాసం మల్లికార్జున్, కాసం నమశ్శివాయ, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్ వివరించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

విజయవాడ : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో పెజ్జోనిపేట లోని నీతోడు మానసిక వికాస కేంద్రంలో నవజీవన్ పూర్వ విద్యార్థుల కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణి చేశారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ ప్రావిన్స్ వైస్ ప్రివిన్షియల్ ఫాదర్ కిషోర్ హాజరై మాట్లాడారు. కుటుంబ వ్యవస్థ బలంగా ఉండాలని, కుటుంబంలోని వ్యక్తులు కలిసికట్టుగా ఉండాలని, పిల్లల మంచి చెడ్డలను గమనించుకొని సక్రమమైన మార్గంలో పెట్టాలని, తల్లిదండ్రులకు అన్ని విధాలుగా సలహాలు, అవసరమైన సహాయాన్ని నవజీవన్ బాల భవన్ అందిస్తుందని అన్నారు. అనంతరం నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ ఎన్.రత్నకుమార్ మాట్లాడుతూ పిల్లల్ని సక్రమ మార్గంలో నడిపించి చక్కదిద్దడానికి అవకాశం ఉన్న ఒకే వ్యవస్థ మన కుటుంబ వ్యవస్థ అని, మనం మాట్లాడే మాటలు, మనం చేసే పనులు మన పిల్లలు గమనిస్తారని అన్నారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ ప్రతి నెలా నిత్యావసర సరుకులు పంపిణి, కుటుంబాల జీవనోపాధికి అవసరమైన సహాయం, వారి గహాలకు మరమ్మతులు లాంటి కార్యక్రమాలతో వారి కుటుంబాన్ని బలోపేతం చేస్తూ కుటుంబ వ్యవస్థకు ప్రాముఖ్యత ఇస్తున్నామన్నారు. పూర్వ విద్యార్థుల కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నీతోడు మానసిక వికాస కేంద్రం సైకాలజిస్టు జి.అనూష, నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్స్ బి.రమేష్, కె.ప్రియాంక, ఎస్.జాకబ్ రాజు, ఎస్.కె.నజ్మా, దేవమణి, జయపాల్, శ్రావణ్ కుమార్, నవజీవన్ పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'ప్రజా వేదిక'లో 72 ఫిర్యాదులు

ప్రజాశక్తి -విజయవాడ : ప్రజల నుంచి స్వీకరిస్తున్న వినతిపత్రాల పరిష్కారానికి ఆయా పోలీస్టేషన్ల ఎస్‌హెచ్‌ఒలు చర్యలు తీసుకోవాలని డిసిపి టి.హరికృష్ణ ఆదేశించారు. ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం జరిగింది. డిసిపి టి.హరికృష్ణ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించి బాధితులు నుండి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 72 ఫిర్యాదులపై భాదితులతో మాట్లాడారు. వికలాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒలతో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకోవాలని డిసిపి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ ఎ.సి.పి. స్రవంతి రాయ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక స్పృహను పెంపొందించుకోవాలి

మాట్లాడుతున్న సుబ్బారావు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విద్యార్థులు సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్త) అన్నారు. రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ పీఎస్‌సీఎంఆర్ కాలేజ్ ఇన్‌స్టలేషన్ కార్యక్రమం ఆ కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హజరైన రావూరి సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించే లక్ష్యంతో రోటరీ క్లబ్ విద్యాసంస్థల్లో రోటరాక్ట్ క్లబ్‌ను నిర్వహిస్తుందన్నారు. విద్యార్థి స్థాయిలో సామాజిక సేవల్లో భాగస్వాములయ్యే విద్యార్థులు రానున్న రోజుల్లో సమాజానికి మరింత మేలు చేసే దిశగా అడుగులు వేస్తారని చెప్పారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్ సుద్ధీ, కోశాధికారి కాజా రాఘవయ్య మాట్లాడుతూ రోటరాక్ట్ క్లబ్ విశిష్టతను, వివిధ సేవా కార్యక్రమాలను గూర్చి వివరించారు. హిందూహైస్కూల్స్ కమిటీ ఎల్లప్పుడూ సమాజ సేవా కార్యక్రమాలను నిర్వహించడంలోనూ, ప్రోత్సహించడంలో ముందుంటుందని చెప్పారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన రోటరాక్ట్ క్లబ్ సభ్యులకు అభినందనలు తెలిపారు. రోటరాక్ట్ క్లబ్ అధ్యక్షునిగా అర్షిత్ భరద్వాజ్, కార్యదర్శిగా అచ్యుత, ఉపాధ్యక్షులుగా శశాంక్ తదితరులు బాధ్యతలు స్వీకరించారు. రోటరీ సభ్యుడు ఎంవీ ప్రసాద్ ఇన్‌స్టలేషన్ కార్యక్రమాన్ని నిర్వహంచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. పతంజలి శాస్త్రి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ మణికంఠ, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ పీ నరేష్, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ పాల్గొన్నారు.

22 నుంచి ఇసుజు ఐ-కేర్ మాన్‌సూన్ క్యాంప్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అత్యుత్తమ యాజమాన్య అనుభవాన్ని అందించడంలో తమ నిబద్ధతను కొనసాగిస్తూ, ఇసుజు మోటర్స్ ఇండియా, దేశవ్యాప్తంగా ఇసుజు ఐ-కేర్ మాన్‌సూన్ క్యాంప్‌ను ప్రారంభించినట్లు సంస్థ ఇంఛార్జి డి.ప్రసాద రావు తెలిపారు. తమ ఇసుజు డి-మాక్స్ పికప్‌లు, ఎస్‌వియు శ్రేణి కోసం ఈ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

కేన్సర్ రోగికి సాయం

ప్రజాశక్తి - తిరువూరు : కేన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి రూ.50,500 ఆర్థిక సహాయం తిరువూరు యువ భారత్ శక్తి ఫౌండేషన్ సభ్యులు సోమవారం అందజేశారు. ఏ.కొండూరు మండలం, పోలిశెట్టిపాడు గ్రామానికి చెందిన కోటమర్తి రాంబాబు కుమార్తె సత్యశ్రీ (12) కేన్సర్‌తో బాధపడుతూ విజయవాడలోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. కుమార్తె వైద్య ఖర్చులకు డబ్బులేక రాంబాబు పడుతున్న ఇబ్బందిని తెలుసుకున్న యువ భారత్ శక్తి ఫౌండేషన్ సభ్యులు దాతల నుండి రూ.50,500 సేకరించారు. ఈ మొత్తాన్ని ఫౌండేషన్ ముఖ్య సభ్యులు సోమవారం ఆసుపత్రికి వెళ్లి సత్యశ్రీ తల్లికి అందజేశారు.

మట్టి ఖర్చులకు సాయం

ప్రజాశక్తి వత్సవాయి : మండలంలోని కన్నెవీడు సొసైటీలో ప్రస్తుతం సబ్‌స్టాఫ్‌గా పనిచేస్తున్న కరిసే వెంకటరత్నం ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. మట్టి ఖర్చుల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు రూ.15 వేలు అసిస్టెంట్ రిజిస్టర్ భూక్యా శ్రీను సంఘ వ్యక్తిగత ఇన్‌ఛార్జి సునీల్, కెడిసిసి వత్సవాయి బ్రాంచ్ మేనేజర్ కమలాకర్, సూపర్వైజర్ శేషగిరిరావు, స్టాలిన్ బాబు, సిఇఒ లావడియా బీమా చేతుల మీదుగా ఇచ్చారు.

ముఠా వర్కర్స్ యూనియన్ కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి - గంపలగూడెం : ఊటుకూరు గ్రామంలో ముఠా వర్కర్స్ యూనియన్ కార్యవర్గం ఏకగ్రీవమైంది. సోమవారం జరిగిన కార్యవర్గంలో అధ్యక్షునిగా పల్లికంటి రాముడు, ఉపాధ్యక్షుడు గద్దల వెంకయ్య, కార్యదర్శి వంగాల శేషయ్య, కోశాధికారి గద్దల శ్రీనుతో పాటు మరో ఐదు గురు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవ మయ్యారు. గౌరవ అధ్యక్షులుగా ఎన్.జె.చారి ఉన్నారు.

రోడ్డుపక్కన వ్యర్థాలు లేకుండా చూడాలి

ప్రజాశక్తి - విసన్నపేట : ప్రధాన రహదారుల పక్కన మాంస వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకో వాలని సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడారు. కొంత మంది మాంసం వ్యర్థాలను విస్సన్నపేట ప్రధాన రహదారుల పక్కన వేస్తున్నారని, దీంతో దుర్వాసన వెలువడుతూ, చుట్టుపక్క ప్రాంతాల వారికి, వాహనదారులకు ఇబ్బందిగా ఉంటోందన్నారు. అందువల్ల వ్యర్థాలను అధికారులు వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మండల పంచాయతీ ఇఒ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ స్వాతికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం విస్సన్నపేట పట్టణ కార్యదర్శి మేకల జ్ఞాన రత్నం సిపిఎం మండల నాయకులు ధనమ్మ, రంగరాణి, గద్దల పులిబళ్ళ ఏడుకొండలు పాల్గొన్నారు.